ధర్మమంజరి

ఉపన్యాసాల సంగ్రహము




తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

ధర్మమంజరి

(మనుమార్గదిక్ప్రదర్శిని)

రచయిత

జటావల్లభుల పురుషోత్తము



ప్రచురణ

కార్యనిర్వహణాధికారి,

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2006

DHARMAMANJARI

(A Glimpse of the Manusmrti)

by
Jatavallabhula Purushottamu

Edited by
D. Nagasidda Reddi

T.T.D. Religious Publications Series No : 422

Re-Prints : 2001, 2006

Copies : 5,000

Published by:
Sri A.P.V.N. Sarma, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati — 517 507

DTP at Keerthi Offset,
103, Prakasam Road, Tirupati.

Printed at
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

ముందుమాట

మనుస్మృతినుంచి కొన్ని ముఖ్యమైన శ్లోకాల్ని గ్రహించి శ్రీ జటావల్లభుల పురుషోత్తంగారు 'ధర్మమంజరి' అనే పేరుతో ఈ గ్రంథాన్ని రచించారు. ప్రాచీన భారతీయుల సాంఘిక, రాజకీయ, ధార్మిక సంబంధమైన జీవితవిధానాల్ని తెలిసికొనడానికి స్మృతి గ్రంథాలెంతైనా తోడ్పడతాయి. శ్రుతుల (వేదముల) తర్వాత ప్రాధాన్యం వహించేవి స్మృతులే. వీటిని ధర్మశాస్త్రాలని కూడా వ్యవహరిస్తారు. ఈనాడు మనకు రాజ్యాంగం ఎలా శిరోధార్యమో ఆనాటి సమాజానికి ఈ స్మృతులు అలాంటివి.

స్మృతిగ్రంథాల్లో మనుధర్మశాస్త్రం భారతదేశమంతటా అంగీకార యోగ్యమైన స్మృతి. ఆచార నియమాలు, రాజధర్మాలు, శాసనసంబంధమైన విషయాలు, వ్యవహార ప్రాయశ్చిత్త విధానాలు, కర్మఫలాదుల వివరణ, వర్ణాశ్రమవిధి విధానం మున్నగు విషయాలెన్నో ఇందులో నిర్దేశించబడ్డాయి. శ్రీ జటావల్లభుల పురుషోత్తముగారు నేటి సామాజిక వ్యవస్థకు అనుగుణమైన శ్లోకాల్ని మనుస్మృతినుంచి ఎన్నుకొని వాటిని సరళమైన భాషలో సర్వజన సులభగ్రాహ్యంగా వ్యాఖ్యానించారు. ధర్మవివేకం, సామాజిక వ్యవస్థ, మానవు డనుసరించవలసిన ధర్మాలు, ఆచారాల వైశిష్ట్యం, ఆధ్యాత్మిక సాధనలు అనే విషయా లిందు చోటు చేసికొన్నాయి. మనువు కాలంనాటి కొన్ని ధర్మాలు కాలానుగుణ్యంగా ఈనాడు కొంచెం ప్రాతబడినవిగా గోచరించినా, ఆనాటి సమాజం ధర్మాన్ని ఎంత నియమబద్ధంగా పాలించేదో మనం గుర్తించడానికీ, స్వార్థపూరితమైన అపమార్గంలో పయనిస్తూ వున్న నేటి సంఘం సక్రమమార్గంలో పురోగమించడానికీ ఈ గ్రంథం కరదీపికలాగా ఉపయోగించగలదనటం సత్యం. ఈ విశ్వాసంతోనే తిరుమల తిరుపతి దేవస్థానములు దీన్ని పునర్ముద్రించింది. ఈ ప్రచురణను పాఠక మహాశయులెల్లరూ మునుపటివలె ఆదరించగలరని ఆశిస్తున్నాం.

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

సూచిక

ధర్మమంజరి

1. ధర్మవివేకము

సుఖమార్గమునకే ధర్మమార్గమని పేరు. ధర్మమాచరించుచున్నవాడు దుఃఖ మనుభవించుటయు, నధర్మ మాచరించువాడు సుఖమనుభవించుటయు లోకములో కన్పట్టుటలేదా యన; యాచరించు ధర్మాధర్మములకు ఫలము వెంటనే సంభవింపకపోవచ్చును. ఎన్నడో చేసిన ధర్మాధర్మముల కిప్పుడు ఫలమనుభవములోనికి రావచ్చును. ఇప్పుడు చేయుచున్న ధర్మాధర్మములకు ఫలమిక ముందెప్పుడో యనుభవము లోనికి రావచ్చును. భౌతిక ప్రపంచములోకూడ నిట్టి యనుభవము మనకు కన్పట్టుచున్నది. నిన్న తిన్న యజీర్ణవస్తువునకు ఫలము నిన్ననే కల్గుట లేదు, నేడు కల్గుచున్నది. పుణ్యాపాపములకు సంబంధించిన ఫలము చిరకాలమునకు పిమ్మట గాని, జన్మాంతరములో గాని, లోకాంతరములో గాని కల్గుననుటలో నాశ్చర్యములేదు. వ్యవసాయము జరుగుచున్న భూమి యప్పటికప్పుడే ఫలింపదు. కావున పాపులు సుఖముగా నుండుటను, పుణ్యాత్ములాపదలతో నుండుటను చూచి యెవ్వడును ధర్మమువలన లాభము లేదనియు నధర్మమువలన హాని లేదనియు తలంపరాదు.

నా ఽధర్మశ్చరితో లోకే సద్యః ఫలతి గౌరివ
శనై రావర్తమానస్తు కర్తుర్మూలాని కృంతతి (4-172)

అధర్మము చేసిన వెంటనే దాని ఫలము కన్పడక పోవచ్చును. భూమి దున్నిన వెంటనే ఫలము నీయదు కదా! అధర్మము క్రమముగా ఫలోన్ముఖమై కర్తను సమూలముగా నాశనము చేయును.

యదినాత్మని పుత్రేషు నచేత్పుత్రేషు నప్తృషు
న త్వేవతు కృతో ఽధర్మః కర్తుర్భవతి నిష్ఫలః. (4-173)

అధర్మము చేసిన వానికి తత్ఫలము స్వవిషయములో కాకపోయినను, కుమారుని విషయములో కాని, మనుమని విషయములో కాని అనుభవములోనికి

వచ్చును. అంతేకాని వ్యర్థముగా పోదు. కావున తాత్కాలికముగా సుఖము నపేక్షించిగాని దుఃఖమును తప్పించుకొనుటకుగాని యధర్మమును చేయరాదు. ఆ యధర్మమువలన వచ్చు దుఃఖ మింతకంటె మిక్కుటముగా నుండును.

న సీదన్నపి ధర్మేణ మనోఽధర్మే నివేశయేత్
అధార్మికాణాం పాపానామాశు పశ్యన్ విపర్యయమ్. (4-171)

ధర్మముతో నున్నవాడు దారిద్ర్యాదులచే బాధపడుచున్నను అధర్మమందు బుద్ధిని చొరనీయకూడదు. ధర్మమును వీడుచో దుఃఖము పోయి, సుఖము వచ్చునని తలంపరాదు. అధార్మికులు చేయు పాపములకు కలుగబోవు దుఃఖమును గురించి యాలోచింపవలయును.

అధార్మికో నరో యో హి యస్య చాప్యనృతం ధనమ్
హింసారతశ్చ యో నిత్యం నేహాసౌ సుఖమేధతే. (1-170)

ఎవడు ధర్మహీనుడో, ఎవడు అన్యాయముచే ధనమును సంపాదించునో, ఎవడు హింసాపరుడో వానికి సుఖముండదు.

ఏ కర్మకు నెంతకాలము పోయిన పిమ్మట, నే లోకములో, నే జన్మములో, నే విధమైన ఫలము వచ్చునో యెరిగిన మహామహులు ధర్మాధర్మములను గురించిన విజ్ఞానమును మన కందజేసియున్నారు. వేదమే మూలముగా గల యీ విజ్ఞానము ధర్మశాస్త్రములోను, పురాణములలోను సర్వజన సులభముగా ప్రతిపాదింపబడి యున్నది. అపారమైన యీ విజ్ఞానముయొక్క సంగ్రహ స్వరూపము మనుస్మృతి. ఈ గ్రంథము మానవునకు శుభప్రదము, మరియు జపహోమాది సత్కర్మబోధకమగుటచే శ్రేష్ఠమయినది, బుద్ధిని వృద్ధిపొందించునది, మోక్షోపాయబోధకమైనది. కావున సర్వోత్కృష్టమయినది.

ఇదం స్వస్త్యయనం శ్రేష్ఠ మిదం బుద్ధి వివర్ధనమ్,
ఇదం యశస్యమాయుష్య మిదం నిశ్రేయసం పరమ్. (1-106)

వేదములు, వేదవిరుద్ధములు గాని స్మృతులు, వేదస్మృతులకు విరుద్ధము కాని సదాచారము-ఇవి ధర్మమును నిర్ణయించుకొనుట కాధారములు; వీని

నెన్నడును ధిక్కరింపరాదు. వీనికి వ్యతిరేకముగా నుండనంతవరకు మాత్రమే మనస్తృప్తి ప్రకారము నడచుకొనవచ్చును.

వేద స్మృతి స్సదాచారః స్వస్య చ ప్రియమాత్మనః
ఏతచ్చతుర్విధం ప్రాహుః సాక్షాద్ధర్మస్య లక్షణమ్. (2-12)

భారతదేశము ధర్మభూమి

ధర్మాచరణబుద్ధి గలవారికి భారతదేశమే వాసయోగ్యమని మనుస్మృతివలన తెలియుచున్నది. (ఆధునిక ప్రాచ్యపాశ్చాత్య ప్రముఖుల దృష్టిలోను నిష్పక్షపాత విమర్శకుల దృష్టిలోను కూడ భారతదేశము ధార్మికముగాను, ఆధ్యాత్మికముగాను ఎల్లదేశములలోను మిన్నయని నా 'భారతీయ వైభవము' 'చిత్రశతకము' మున్నగు గ్రంథములలో నిరూపించి యున్నాను.)

మనువు భారతదేశములోని నాలుగు భాగములను పేర్కొనినాడు. 1. బ్రహ్మావర్తము, 2. బ్రహ్మర్షిదేశము, 3. మధ్యదేశము, 4. ఆర్యావర్తము. ఈ నాల్గింటిని చెప్పిన పిమ్మట కృష్ణమృగము (నల్లలేడి) చరించు ప్రదేశమంతయు యజ్ఞీయభూమి యని చెప్పినాడు. కృష్ణమృగము పై నాలుగు ప్రదేశములలోనే కాక మిగిలిన భారతదేశమందంతటను తిరుగును;కావున భారతదేశమంతయు యజ్ఞీయ భూమి. అందు ప్రత్యేకముగా పేర్కొనబడిన నాల్గు ప్రదేశములును విశేషముగా పుణ్యభూములని తాత్పర్యము.

సరస్వతీ దృషద్వత్యో ర్దేవనద్యోర్య దన్తరమ్
తం దేవనిర్మితం దేశం బ్రహ్మావర్తం ప్రచక్షతే. (2-17)

సరస్వతి, దృషద్వతి యను రెండు పుణ్యనదుల నడుమగల దివ్య ప్రదేశమును బ్రహ్మావర్తమని చెప్పుదురు.

కురుక్షేత్రం చ మత్స్యాశ్చ పాంచాలాః శూరసేనకాః
ఏష బ్రహ్మర్షిదేశోవై బ్రహ్మావర్తా దనన్తరః. (2-19)

ఏతద్దేశ ప్రసూతస్య సకాశా దగ్రజన్మనః
స్వం స్వం చరిత్రం శ్రేరన్ పృథివ్యాం సర్వమానవాః. (2-20)

కురుక్షేత్రము, మత్స్యదేశము, పాంచాలము, శూరసేనము-ఇవి కలసి బ్రహ్మర్షిదేశ మనబడును. ఇది బ్రహ్మవర్తము నానుకొని యున్నది. (ప్రపంచములోని అన్ని దేశములవారును ఈ దేశములో జన్మించిన బ్రాహ్మణునివలన తమ తమ యాచారములను తెలిసికొనవలయును.)

హిమవద్వింధ్యయోర్మధ్యం యత్ప్రాగ్వినశనాదపి
ప్రత్యగేవ ప్రయాగాచ్చ మధ్యదేశః ప్రకీర్తితః. (2-21)

హిమవ ద్వింధ్యపర్వతములకు మధ్యగాను, సరస్వతీ నద్యంతర్ధాన ప్రదేశమునకు తూర్పుగాను, ప్రయాగకు పశ్చిమముగను ఉన్న దేశము మధ్యదేశ మనబడును.

ఆ సముద్రాత్తు వై పూర్వా దా సముద్రాత్తు పశ్చిమాత్
తయో రేవాన్త రంగిర్యోరార్యావర్తం విదుర్బుధాః. (2-22)

తూర్పు పడమరల సముద్రపర్యంతము వ్యాపించి, వింధ్యహిమాచలముల మధ్యనున్న దేశమును ఆర్యావర్తమని పండితులు చెప్పుదురు.

కృష్ణసారస్తు చరతి మృగో యత్ర స్వభావతః
స జ్ఞేయో యజ్ఞియో దేశో మ్లేచ్ఛదేశ స్త్వతః పరః. (2-23)

కృష్ణసార మను నల్లనిలేడి ఏ ప్రదేశములో స్వభావముగానే తిరుగునో అది యజ్ఞార్హమైన ప్రదేశము. మిగిలిన ప్రదేశములు మ్లేచ్ఛదేశము లనబడును.

ఏతాన్ ద్విజాతయో దేశాన్ సంశ్రయేరన్ ప్రయత్నతః
శూద్రస్తు యస్మిన్కస్మిన్వా నివసే ద్వృత్తికర్శితః. (2-24)

ఈ దేశములను -బ్రహ్మవర్తము, బ్రహ్మర్షిదేశము, మధ్యదేశము ఆర్యావర్తము అనువానిని, మరియు కృష్ణమృగము తిరుగు ఇతర ప్రదేశములను ద్విజులు ప్రయత్నపూర్వకముగానైనను ఆశ్రయింపవలయును. ఇతరుడుకూడ ఈ ప్రదేశములలోనే నివసింపవలయును, కాని వృత్తిలేక బాధపడునపు డాతడు ఇతర దేశముల కేగవచ్చును. (కృష్ణమృగము ఈ నాల్గుదేశములలోను, దక్షిణ భారతములోను తప్ప ప్రపంచములో మరి యే దేశములోను

స్వాభావికముగా నుండదు. కావున భారతదేశమే చాతుర్వర్ణ్యమువారికిని ముఖ్యముగా నివాసయోగ్యము.) అంతియే గాక, భారతేతరదేశములలోను, భారతదేశములో బ్రాహ్మణులు కన్పట్టని ప్రాంతములలోను స్థిరనివాస మేర్పరచుకొన్న చాతుర్వర్ణ్యము వారికి ఉపనయనాది సంస్కారములు జరుగుటకును, బహుధర్మ పరిపాలనమునకును అవకాశ ముండదు. కావున వర్ణభ్రష్టత్వము సంభవించును. కొందరు క్షత్రియులా రీతిగా వృషలత్వము చెందినారని మనువు చెప్పుచున్నాడు.

శనకైస్తు క్రియాలోపాదిమాః క్షత్రియ జాతయః
వృషలత్వం గతాలోకే బ్రాహ్మణాఽదర్శనే న చ

పౌండ్రకా శ్చౌఢ్ర ద్రవిడాః కాంభోజా యవనా శ్శకాః
పారదా పహ్లవా శ్చీనాః కిరాతా దరదాః ఖశాః. (10-43,44)

పౌండ్రక, ఓఢ్ర, ద్రవిడ, కాంభోజ, యవన, శక, పారద, పహ్లవ, చీన, కిరాత, దరద, ఖశదేశములందు జన్మించిన క్షత్రియులు బ్రాహ్మణ దర్శనము లేనివారై ఉపనయనాది సంస్కారహీనులై క్రమముగా వృషలత్వము చెందిరి. (నివాసదేశమునకును ధర్మానుష్ఠానమునకును ఇట్టి సంబంధము కలదు.)

చతుర్యుగములు - ధర్మస్థితి

చతుష్పాత్సకలో ధర్మః సత్యం చైవ కృతేయుగే
నాఽధర్మేణాఽగమః కశ్చిన్మనుష్యా న్ప్రతివర్తతే. (1-81)

కృతయుగములో ధర్మము నాలుగు పాదములతో నడచును, సత్యము కూడ నంతియే. ఆ యుగములో నధర్మముచేత ధనసంపాదనము మున్నగు దోషములు మనుష్యులలో కన్పట్టవు. (ఇట ధర్మములను గురించి చెప్పి మరల సత్యమును గురించి ప్రత్యేకముగా చెప్పుట చేత ధర్మము లన్నింటిలోను సత్యమునకుగల ప్రాధాన్యము తెలియు చున్నది.)

ఇతరేష్వాగమా ద్ధర్మః పాదశస్త్వవరోపితః
చౌరికానృత మాయాభి ర్ధర్మశ్చాపైతి పాదశః. (1-82)

త్రేతా, ద్వాపర, కలియుగములలో ధనాదిసంపాదనము అధర్మము చేత జరుగుటవలన, అట్టి అధర్మార్జిత ధనాదులచే చేయబడు యజ్ఞాది ధర్మము యుగమున కొకపాదము చొప్పున క్రిందికి దిగిపోవుచుండును. త్రేతాయుగములో ధర్మము ముప్పాతికపాలును, ద్వాపరములో సగమును, కలిలో నాల్గవవంతును నిలిచియుండును. దొంగతనము, అసత్యము, మోసము మున్నగువానిచేతకూడ ధర్మముయొక్క ఒక్కొక్కపాదము క్రమముగా ప్రతియుగములోను లోపించును.

ధర్మము తగ్గిపోవుటకు చౌర్యము, అసత్యము, మాయలక్షణములుగా నిచ్చట చెప్పుటచే మనువుమతములో నివియెంత పెద్దదోషములో ఋజువర్తనము, సత్యము, అస్తేయము ఎంత గొప్పధర్మములో స్పష్టమగుచున్నది.

తపః పరం కృతయుగే త్రేతాయాం జ్ఞాన ముచ్యతే
ద్వాపరే యజ్ఞమేవాహు ర్దానమేకం కలౌ యుగే. (1-86)

అన్ని యుగములలోను తపస్సు, బ్రహ్మజ్ఞానము, యజ్ఞము, దానము అనునవి ధర్మములేయైనను కృతయుగములో తపస్సు, త్రేతాయుగములో జ్ఞానము, ద్వాపరములో యజ్ఞము, కలిలో దానము ముఖ్యముగా గొప్ప ధర్మములు.

ధర్మమొక్కటియే మిత్రము

ధర్మముతప్ప మరియేదియు నమ్మదగిన మిత్రము కాదు.

ఏకఃప్రజాయతే జంతురేక ఏవ ప్రలీయతే
ఏకో ఽనుభుంక్తే సుకృత మేక ఏవచ దుష్కృతమ్. (4-240)

మానవుడు పుట్టినప్పుడు ఒక్కడే పుట్టుచున్నాడు; మరణించునపుడు కూడ నంతియే. తన పుణ్యమును పాపమును తా నొక్కడే అనుభవించు చున్నాడు.

మృతం శరీరముత్సృజ్య కాష్ఠలోష్టసమం క్షితౌ
విముఖా బాంధవా యాంతి ధర్మస్తమనుగచ్ఛతి. (4-241)

కట్టెవంటియు, మట్టిపెళ్లవంటియు, మృతకళేబరమును శ్మశానములో విడిచి బంధువు లింటికి పోవుదురు. ఆ పైనికూడ వచ్చునది ధర్మము మాత్రమే.

నాముత్రహి సహాయార్థం పితా మాతా చ తిష్ఠతః
న పుత్రదారా న జ్ఞాతి ర్ధర్మ స్తిష్ఠతి కేవలః. (4-239)

పరలోకమున సహాయముకొఱకు తల్లిదండ్రి ఉండరు; భార్యా పుత్త్రులుండరు; జ్ఞాతి యుండడు; కేవలము ధర్మమే యుండును.

ధర్మం శనైః సంచినుయాద్వల్మీకమివ పుత్తికాః
పరలోక సహాయార్థం సర్వభూతా న్యపీడయన్. (4-238)

పురుగులు పుట్టకొరకు మట్టిని సమకూర్చుకొనునట్లు మానవుడు పరలోకసహాయము కొరకై ధర్మమును నెమ్మదిగా సమకూర్చుకొనవలెను. ఏ ప్రాణిని బాధపెట్టకుండ సమకూర్చుకొనవలయును. (మనుమతములో భూతదయ యెంతముఖ్యమో దీనివలన తెలియుచున్నది.)

తస్మాద్ధర్మం సహాయార్థం నిత్యం సంచిమయాద్బుధః
ధర్మేణ హి సహాయేన తమస్తరతి దుస్తరమ్. (4-242)

కావున ఎల్లప్పుడును సహాయముకొరకై ధర్మము నెమ్మదిగా సంపాదించుకొనుచుండ వలయును. ధర్మ మనెడు సహాయముచేత దుస్తరమైన తమస్సును మానవుడు దాటగలుగును.

ధర్మప్రధానం పురుషం తపసా హతకిల్బిషమ్
పరలోకం నయత్యాశు భాస్వంతం ఖశరీరిణమ్ (4-243)

తపస్సుచేత పోగొట్టబడిన పాపము గల్గినట్టియు, ధర్మప్రధానుడైనట్టియు, బ్రహ్మస్వరూపుడైనట్టియు పురుషుని అతని ధర్మమే దివ్యలోకములకు తీసికొని పోవును.

ధర్మము మానవుని ఉద్ధరించుట ఎంతసత్యమో, అధర్మము మానవుని ముంచివేయుట అంత సత్యము. ధర్మశబ్దములోనే యీ యర్థము కలదు.

మానవుని మంచిస్థితిలో నిలబెట్టునది ధర్మము. "ధరతి ధారయతీతి వా ధర్మః" "ధారణాత్ ధర్మ మిత్యాహుః" ఇత్యాది నిర్వచనము లీ యర్థమునే తెలుపును.

ధర్మ ఏవహతో హంతి ధర్మో రక్షతి రక్షితః
తస్మాద్ధర్మో న హంతవ్యోమానో ధర్మోహతోఽవధీత్. (8-15)

ధర్మము కొట్టబడినదై మనలను కొట్టివేయును. రక్షింపబడినదై మనలను రక్షించును. కావున ధర్మము ఉల్లంఘింపదగినది కాదు. ధర్మము కొట్టివేయబడకుండు గాక! మనల నది అణచివేయకుండు గాక!

కావున ధర్మ మొక్కటియే సర్వకాలములలోను తోడ్పడు మిత్రము.

ఏక ఏవ సుహృద్ధర్మో నిధ నేప్యనుయాతి యః
శరీరేణ సమం నాశం సర్వమన్యద్ధి గచ్ఛతి. (8-17)

మరణానంతరము కూడ విడిచి పెట్టకుండ వచ్చునది ధర్మము. అది యొక్కటియే నిజమైన మిత్రము. మిగిలిన ధన వస్తు వాహనాదికమే కాక బంధువర్గము కూడ, శరీరముతోపాటే మానవుని విడిచి పెట్టిపోవును.

కర్మ ఫలము

ధర్మాధర్మములవలన గలుగు సుఖదుఃఖఫలముల నవశ్య మనుభవింప వలసి యుండును. సర్వకర్మఫలప్రదాతయైన పరమేశ్వరునకు తెలియకుండ రహస్యాతి రహస్యముగకూడ నెవడు నే పాపమును చేయ జాలడు. "సహస్రాక్ష స్సహస్రపాత్" అని చెప్పబడు సర్వేశ్వరుడన్నింటిని చూచుచునే యుండును. సూర్యచంద్రులు పరమేశ్వరనేత్రములుగా వర్ణింపబడిరి, అట్లే పృథివ్యాదులు పరమేశ్వరశరీరముగా వర్ణింపబడినవి. పృథివి, ఆకాశము, జలము, హృదయము, చంద్రుడు, సూర్యుడు, యముడు, వాయువు, రాత్రి, ఉభయసంధ్యలు, ధర్మము - అనునవి సర్వకర్మలకును సాక్షులు.

ద్యౌర్భూమిరాపో హృదయం చంద్రార్కాగ్ని యమాఽ నిలాః
రాత్రిస్సంధ్యే చ ధర్మశ్చ వృత్తజ్ఞా స్సర్వదేహినామ్. (8-86)

శుభాశుభఫలం కర్మ మనోవాగ్దేహ సంభవమ్
కర్మజా గతయో నృణాముత్తమాధమమధ్యమాః. (12-3)

మనస్సుచేతను, వాక్కుచేతను, శరీరముచేతను చేయబడు కర్మ శాస్త్రవిహితమైనదగుచో సుఖమును, శాస్త్రనిషిద్ధమైనదగుచో దుఃఖమును తెచ్చిపెట్టును. ప్రాణులకు గలుగు ఉత్తమాధమ మధ్యమగతులు వారు చేసికొన్న కర్మవలననే కలుగును. ఇచట కర్మయనగా సంకల్పించుట, ఊహించుట, ధ్యానించుట, మాట్లాడుట, శరీరముతో వ్యవహరించుట మున్నగువాని కన్నింటికిని వర్తించును. కావున పవిత్రభావములు పవిత్ర సంకల్పములు, పవిత్రవాక్కులు, పవిత్రచేష్టలు అలవరచుకొనదగినవి. ఇందులకు కొన్ని యుదాహరణములు :

పరద్రవ్యేష్వభిధ్యానం మనసాఽనిష్టచింతనమ్
వితథాఽభినివేశశ్చ త్రివిధం కర్మమానసమ్. (12-5)

ఇతరులసొత్తును హరింపవలయునను ఆలోచన, పాపకర్మలను మనస్సుచే సంకల్పించుట, పరలోకము లేదనియు, మనస్సే ఆత్మయనియు తలంచుట - ఇవి మూడువిధములైన మానసకర్మలు. ఇవి అశుభఫలమును గల్గించును. వీనికి వ్యతిరేకములైన మానసకర్మలు, అనగా పరులకు లాభమును కోరుట, పుణ్యకర్మలను చేయవలయునని సంకల్పించుట, పరలోక మున్నదనియు పరమేశ్వరుడున్నాడనియు నిశ్చయించుకొనియుండుట- ఇవి శుభఫలము నొసంగు మానసికకర్మలు.

పారుష్య మనృతం చైవ పై శున్యం చాపి సర్వశః
అసంబద్ధ ప్రలాపశ్చ వాఙ్మయం స్యాచ్చతుర్విధమ్. (12-6)

ఎదుటివానికి కష్టముకల్గునట్లు మాట్లాడుట, అసత్యము పల్కుట, చాటున ఇతరులపై కొండెములు చెప్పుట, అనవసరముగ నితరుల గొడవ లను చెప్పుకొనుట - ఇవి నాలుగువిధములయిన వాచికకర్మలు. వీని వలన అశుభము వచ్చును. మృదువుగా మాట్లాడుట, సత్యమునే పల్కుట, పరుల సద్గుణములను ప్రశంసించుట, అనవసరప్రసంగములను విడిచిపెట్టుట ఇవి నాలుగును శుభఫలము గల్గించు వాచికకర్మలు.

అదత్తానా ముపాదానాం హింసా చైవా విధానతః
పరదారోపసేవా చ శారీరం త్రివిధం స్మృతమ్. (12-7)

ఇతరులసొమ్మును అపహరించుట, వేద శాస్త్రానుమతి లేకుండా హింస గావించుట, పరస్త్రీ సంపర్కము - ఈ మూడువిధములైన శారీర కర్మలు అశుభఫలము నిచ్చును. ఏతద్వ్యతిరిక్త కర్మలు శుభఫలము నొసగును.

మానసం మనసైవాయ ముపభుంక్తే శుభాశుభమ్
వాచావాచాకృతం కర్మ కాయేనైవ చ కాయికమ్. (12-8)

మనస్సుచేత చేసిన పుణ్యాపాపముల ఫలమును మనస్సుచేతనే అనుభవింపవలసి యుండును. వాక్కుచేత చేసిన పుణ్యాపాపకర్మల శుభాశుభ ఫలమును వాక్కుచేతనే అనుభవింపవలసి యుండును. శరీరముచేత చేసిన పుణ్యాపాపకర్మల శుభాశుభఫలమును శరీరముచేతనే అనుభవింపవలసి యుండును.

శరీరజైః కర్మదోషైర్యాతి స్థావరతాం నరః
వాచికైః పక్షిమృగతాం మానసైరంత్యజాతితామ్. (12-9)

ఎవడు శరీరముచేత మిక్కుటమైనపాపములను చేయునో వాడు తరుగుల్మలతాది జన్మను పొందును. ఎవడు వాక్కుచేత బహుళపాపములను చేయునో వాడు పశుపక్ష్యాది జన్మను పొందును. ఎవడు మనస్సుచేత హెచ్చుగా పాపములను చేయునో వాడు చండాలాది జన్మను పొందును. (స్త్రీలు పాపఫలముగా తిర్యగ్యోనులయందు జన్మించుచో స్త్రీత్వముతోనే జన్మింతురని మనువు చెప్పుచున్నాడు.) (12-69)

ఈ జన్మలో అనుభవింపబడు రూపవైకల్యాదులకు కారణము ఈ జన్మలోని పాపములైనను కావచ్చును, పూర్వజన్మలోని పాపములైనను కావచ్చును.

ఇహ దుశ్చరితైః కేచిత్కేచిత్పూర్వకృతై స్తథా
ప్రాప్నువన్తి దురాత్మనో నరారూప విపర్యయమ్. (11-48)

ఈ రీతిగా పుణ్యకర్మలకు శుభఫలమును, పాపకర్మలకు అశుభఫలమును అనుభవింపవలసి యుండును.

మానవజన్మ సార్థక్యము

ధర్మాచరణావకాశ ముండుటవలననే మానవజన్మ శ్రేష్ఠమైనది.

భూతానాం ప్రాణినః శ్రేష్ఠాః ప్రాణినాం బుద్ధిజీవినః
బుద్ధిమత్సు నరాః శ్రేష్ఠా నరేషు బ్రాహ్మణాః స్మృతాః
బ్రాహ్మణేషు చ విద్వాంసో విద్వత్సుకృత బుద్ధయః
కృతబుద్ధిషు కర్తారః కర్తృషు బ్రహ్మవేదినః. (1-96, 97)

స్థావరజంగమములలో కదలికలేనివానికంటె కదలికగలవి గొప్పవి. ఏ కొలదిసుఖమైనను వాని కప్పుడప్పు డనుభవములోనికి వచ్చును. (తరుగుల్మ లతాదులకును సుఖదుఃఖానుభూతియున్నను అది ప్రకటము కాదని మనువు చెప్పియున్నాడు.) ఆ ప్రాణులలోను బుద్ధినుపయోగించి సుఖము ననుభవింపగల్గు పశుపక్ష్యాదులు గొప్పవి. బుద్ధిగల ఈ ప్రాణులలోను ధర్మాధర్మజ్ఞానముగల మనుష్యులు శ్రేష్ఠులు. వీరు ధర్మమునాచరించి సుఖము పొందగల్గుదురు. అధర్మమును వీడి దుఃఖమును తప్పించుకొన గలుగుదురు. ఆ నరులలోను బ్రాహ్మణులు శ్రేష్ఠులు. బ్రాహ్మణులలోను ధర్మస్వరూపమును పూర్తిగా నెరిగిన విద్వాంసులు గొప్పవారు. అందునను వైదికధర్మమందు శ్రద్ధగలవారు ఘనులు. వారిలోను ఆ ధర్మము నాచరించువారు ఉత్కృష్టులు. ఆ యాచరించువారిలోను స్వర్గాదికామములతో ఆచరించువారికంటె మోక్షాపేక్షతో నిష్కామముగా నాచరించి బ్రహ్మజ్ఞానము పొందినవారు శ్రేష్ఠులు. కావున సర్వప్రాణులలోని శ్రేష్ఠత్వమనునది ధర్మమునుబట్టియే నిర్ణయింపబడును.

కావున మానవజన్మ కల్గినపిమ్మట బుద్ధి నుపయోగించి జ్ఞానము వలన పొందదగిన యానందమును పొందవలయును; శాస్త్రోక్తకర్మల నాచరించి స్వర్గాది పుణ్యలోకములను, ఉత్తమజన్మలను పొందుటకు ప్రయత్నించ

వలయును. ఆ శాస్త్రోక్తకర్మలనే నిష్కామముగా నాచరించి చిత్తశుద్ధిని, తద్వారా మోక్షమును పొందుటకు యత్నించుట అంతకంటెను ప్రశస్తమైనది.

బ్రాహ్మణుడితరులకంటె ఐహికభోగములను తక్కువగా ననుభవించి ఆముష్మిక శ్రేయస్సాధనములను ఎక్కువ నాచరింపవలయునని మనువు తాత్పర్యము.

బ్రాహ్మణస్య తు దేహోయం నోపభోగాయ కల్పతే
తపసే బహురూపాయ ప్రేత్యానంత సుఖాయచ.

బ్రాహ్మణశరీరము భోగములకొఱకు తగదు. బహువిధములైన తపస్సులను చేసి మరణానంతరము అనంతసుఖమును సంపాదించుకొనుటకు తగియున్నది. (పై నుదాహరింపబడిన 1-96 శ్లోకములోని బ్రాహ్మణశ్రేష్ఠ్యమున కిది కారణము.)

మోక్షసాధనము

యజ్ఞదాన తపఃకర్మాత్మకమైన ధర్మము స్వర్గకాములకుమాత్రమే కాక మోక్షకాములకుకూడ అనుష్ఠేయమేయని భగవద్గీత చెప్పుచున్న యంశము మనుస్మృతిలో కూడా కన్పట్టుచున్నది. ధర్మాచరణము మోక్ష ప్రతిబంధములను తొలగించును.

సర్వభూతేషు చాత్మానం సర్వభూతాని చాత్మని
సమంపశ్య న్నాత్మయాజీ స్వారాజ్య మధిగచ్ఛతి. (12-91)

సర్వభూతములయందును ఒకేయాత్మ యున్నదనియు, పరమాత్మయందే సర్వభూతములు నున్నవనియు గుర్తించుచు సర్వకర్మలను బ్రహ్మార్పణముగా చేయువాడు మోక్షమును పొందును. (ఇట్టి పట్లవైదిక కర్మయోగ మగుచున్నది. అనగా బ్రహ్మప్రాప్తి కుపాయమగుచున్నది.)

వైదికే కర్మయోగేతు సర్వాణ్యేతా న్యశేషతః
అంతర్భవంతి క్రమశ స్తస్మిన్ స్తస్మిన్ క్రియావిధౌ. (12-87)

ఈ కర్మయోగమందు మోక్షఫలము మాత్రమేకాక ఐహికాముష్మిక శ్రేయస్సులన్నియు నిమిడియున్నవి.

సుఖాభ్యుదయికం చైవ నైః శ్రేయసిక మేవ చ
ప్రవృత్తం చ నివృత్తం చ ద్వివిధం కర్మవైదికమ్. (12-88)

వైదికకర్మ రెండు విధములు: ప్రవృత్తకర్మ, నివృత్తకర్మ, స్వర్గాది సుఖముల నిచ్చి సంసారములో నిలబెట్టునది ప్రవృత్తకర్మ. మోక్షము నిచ్చునది నివృత్తకర్మ.

ప్రవృత్తకర్మ స్వర్గాదివాంఛలతో చేయబడును, నివృత్తకర్మ మోక్షాభిలాషతో చేయబడును.

ఇహచాముత్ర వా కామ్యం ప్రవృత్తం కర్మకీర్త్యతే
నిష్కామం జ్ఞానపూర్వంతు నివృత్తముపదిశ్యతే. (12-89)

ఈ లోకములోకాని, స్వర్గాదిలోకములలోకాని సుఖము ననుభవింప వలయునను కోరికతో చేయబడుకర్మ ప్రవృత్తకర్మ యనబడును. నిష్కామముగాను, జ్ఞానాభ్యాసపూర్వకముగాను ఆచరింపబడుకర్మ నివృత్తకర్మ మనబడును. (దీనికిని శ్రీశంకరులు వాడినపరిభాషకును భేదము గుర్తింపబడినది. నిష్కామకర్మకు ప్రవృత్తి ధర్మమనియు, వైరాగ్యాదికమునకు నివృత్తిధర్మమనియు జగద్గురువులు వాడిన పరిభాష.)

ప్రవృత్తం కర్మసంసేవ్య దేవానామేతి సామ్యతామ్
నివృత్తం సేవమానస్తు భూతాన్య త్యేతి పంచవై. (12-90)

ప్రవృత్తకర్మ నాచరించుట వలన సామాన్యమైన ఐహికాముష్మిక సుఖములు కలుగుటయేగాక దేవతలతో సమానత్వముకూడ కల్గును. నివృత్తకర్మ నాచరించువాడు తుదకు శరీరోత్పత్తికి కారణములైన పంచభూతములను అతిక్రమించును, అనగా మోక్షము పొందును.

ఇహపరలోక సుఖములను పొందుటకైనను నిత్యనిరతిశయానందాత్మకమైన మోక్షస్థితిని పొందుటకైనను ధర్మాచరణసాధన మనునది నిష్కృష్టార్థము.

2. సామాజికవ్యవస్థ

ప్రపంచములో భారతదేశమునకు ప్రతిష్ఠ తెచ్చినవానిలో మనుస్మృతి యొకటి. మానవులొకరిపట్ల నొక రవలంబింపవలసిన ప్రవర్తనవిధానము మనుస్మృతిలో విపులముగా నిర్దేశింపబడియున్నది. మృదుత్వము, దయ, ప్రేమ, సాత్త్వికత మున్నగు మహోన్నతగుణములతో మానవుల నుత్తేజింప చేయగల సమాజమర్యాదాప్రణాళిక మనువులో కన్పట్టుచున్నది. ఏ కాలము వారికయినను, ఏ దేశమువారికయినను ఉపాదేయములైన యుపదేశము లిందు మిక్కుటముగా నున్నవి.

ప్రాచీనధర్మాచార్యులు వ్యక్తులకొరకే ముఖ్యముగా ధర్మోపదేశము చేసినారు కాని సమాజముకొఱకు కాదు. అనగా సమాజమేదో నిర్దిష్టస్థితి లోనికి వచ్చువరకు వ్యక్తులు తమధర్మమును నిర్వహింప నక్కరలేని వ్యవస్థను గాని, సమాజమును మార్చుటకే వ్యక్తులు నిరంతరము కృషి చేయుచుండ వలయునను సందర్భమునుకాని ప్రాచీనధర్మాచార్యులు సంకల్పింపలేదు. ఉత్తమవ్యక్తులతో ఉత్తమసమాజ మేర్పడునను సిద్ధాంతము మీదనే వారి బోధలు సాగినట్లు కన్పించును. సమష్టివ్యవస్థ యుపేక్షింపబడినదని దీనియర్థము కాదు.

ఎవ్వరిని అవమానింపరాదు

ఎవ్వరి మనస్సును నొప్పింపకుండుట సమాజధర్మములలో మొదటిది. "ఎదుటివాడు బాధను కల్గించినను వానిపట్ల కఠినోక్తులను పల్కరాదు; వానిప్రాణమును నొప్పింపరాదు. ఎవ్వరికిని ద్రోహము చేయుసంకల్పము పొందరాదు; ఇతరులకు తనవలన హాని కల్గునను భయమును కల్గింపరాదు. ఈ యాదేశములకు విరుద్ధముగా ప్రవర్తించుట పుణ్యలోకప్రాప్తికి ప్రతిబంధకము."

నారుంతుదస్యా దార్తోపి న పరద్రోహ కర్మధీః

యథాస్యోద్విజతేవాచా నాలోక్యాం తాముదీరయేత్. (2-161)

అహింసయైవ భూతానాం కార్యం శ్రేయానుశాసనమ్
వాక్చైవ మధురా శ్లక్ష్ణా ప్రయోజ్యా ధర్మమిచ్ఛతా. (2-159)

"ఎదుటివానికి లాభముకలిగించు విషయము నుద్దేశించునపుడుకూడ వానికి బాధను కల్గింపకూడదు. మధురవాక్కులతోనే చెప్పవలెను. వాని గుండె యదురునట్లు చెప్పకూడదు."

"నేను వానిని అవమానపరచి వేసినాను, వీనిని సిగ్గుపరచివేసినాను" అని గర్వించువాడు వివేకహీనుడు. చివరకు నశించువాడు అవమానించినవాడే కాని యవమానింపబడినవాడు కాదని మనువు చెప్పుచున్నాడు.

సుఖం హ్యవమతః శేతే సుఖం చ ప్రతిబుధ్యతే
సుఖం చరతిలోకేఽస్మి న్నవమంతా వినశ్యతి. (2-163)

అవమానము పొందినవాడు సుఖముగా నిద్రపోవును. సుఖముగా తిరుగును. అవమానించినవాడు పాపఫలము ననుభవింపక తప్పదు; తుదకు వాడే నశించును.

ఎవ్వరిని ఆక్షేపింపకూడదు

జన్మాంతరమందు చేసికొన్న పాపమునకు ఫలితముగా ఈ జన్మలో కలిగిన లోపములకు కాని, హైన్యమునకు కాని ఎవ్వరిని ఆక్షేపింపరాదు. వార్ధక్యముతో బాధపడువారిని కూడ ఆక్షేపింపరాదు.

హీనాంగా నతిరిక్తాంగాన్ విద్యాహీనాన్ వయోధికాన్
రూపద్రవ్య విహీనాంశ్చ జాతిహీనాంశ్చ నాక్షిపేత్. (4-141)

"అవయవలోపము కలవారిని, అవయవాధిక్యము కలవారిని, విద్యావిహీనులను, వృద్ధులను, కురూపులను, దరిద్రులను, హీనజాతి వారిని ఆక్షేపింపకూడదు."

పదిమందిచేత 'దాసోహ' మ్మనిపించుకొనవలెనను బుద్ధితో సమ్మానమును గోరుట నింద్యము.

సమ్మానాత్ బ్రాహ్మణోనిత్య ముద్విజేత విషాదివ. (2-162)

బ్రాహ్మణుడు, విషమునకు వలె సమ్మానమునుండి భయపడవలెను.

బ్రాహ్మణుని నిమిత్తముగా చెప్పబడిన యిట్టినియమములు అన్ని వర్ణములవారికిని వర్తించునని మనుస్మృతిలోనే మరొకచోట చెప్పబడినది. (10-123)

పెద్దలపట్ల గౌరవము

ఆచార్యం చ ప్రవక్తారం పితరం మాతరం గురుమ్
న హింస్యాత్ బ్రాహ్మణాన్ గాశ్చ సర్వాంశ్చైవ తపస్వినః(4-162)

ఉపనయనముచేసిన ఆచార్యుని, వేదార్థముచెప్పగల విద్వాంసుని, తల్లిని, తండ్రిని, గురువును, బ్రాహ్మణులను, తపస్వులను వ్యతిరేకించి వారి మనస్సులను నొప్పింపరాదు.

ఆచార్య శ్చ పితా చైవ మాతా భ్రాతా చ పూర్వజః
నార్తే నాప్యవమంతవ్యా బ్రాహ్మణేన విశేషతః

ఆచార్యో బ్రాహ్మణోమూర్తిః పితామూర్తిః ప్రజాపతేః
మాతామూర్తిః పృథివ్యాస్తు భ్రాతాస్వోమూర్తిరాత్మనః

తయోర్నిత్యం ప్రియం కుర్యా దాచార్యస్య చ సర్వదా
తేష్వేవ త్రిషు తుష్టేషు తపస్సర్వం సమాప్యతే

తేషాం త్రయాణాం శుశ్రూషా పరమం తప ఉచ్యతే
నతై రభ్యననుజ్ఞాతో ధర్మమన్యం సమాచరేత్.(2-225,26,28,29)

ఆచార్యుడు, తల్లి, తండ్రి, అన్న - వీరు ఎన్నడును అవమానింప దగినవారు కారు. వారివల్ల బాధకల్గినను వారి నవమానింపరాదు. ఈ ధర్మము బ్రాహ్మణునకు మరింత ముఖ్యము. ఆచార్యుడు బ్రహ్మ; తండ్రి ప్రజాపతి; తల్లి పృథివి; సోదరుడు తన స్వరూపమే . తల్లి, తండ్రి, ఆచార్యుడు వీరి

కెల్లప్పుడును సంతోషము గల్గింపవలెను. దానివలన సర్వతపస్సు చేసినట్లగును. వీరి యనుమతిలేకుండ ఏ ధర్మమును చేయరాదు.

ఒక్కజన్మలోని తలిదండ్రుల ఋణమును తీర్చుకొనుటకైనను అనేక జన్మలు చాలవనియు, అంతటిక్లేశమును పుత్రునికొరకు తలిదండ్రులు పడుదురనియు మనువు ఇట్లు చెప్పుచున్నాడు.

యం మాతా పితరౌ క్లేశం సహేతే సంభవే నృణామ్
న తస్య నిష్కృతి శ్శక్యా కర్తుం వర్ష శతైరపి. (2-227)

పెద్దల సేవ

ఊర్ధ్వం ప్రాణాహ్యుత్క్రామంతి యూనః స్థవిర ఆయతి
ప్రత్యుత్థానాభివాదాభ్యాం పునస్తాన్ ప్రతిపద్యతే. (2-120)

వయోవిద్యాదులచే అధికుడైనవాడు వచ్చుచుండగా, చిన్నవానికి భయముచే ప్రాణములు పైకి పోవును. ఆయనకు ఎదురుగా వెళ్ళి నమస్కరించిన తర్వాత, ఆ యువకుడు తిరిగి ప్రాణములను పొందును.

అభివాదన శీలస్య నిత్యం వృద్ధోపసేవినః
చత్వారి పరవర్ధంతే ఆయుర్విద్యా యశో బలమ్. (2-121)

పెద్దలకు నమస్కరించి సేవించువానికి ఆయువు, విద్య, యశస్సు, బలము వృద్ధిపొందును. (పెద్దలకు నమస్కరింపవలసిన పద్ధతి ఈ క్రింది విధముగా నున్నది.)

వ్యత్యస్త పాణినా కార్య ముపసంగ్రహణం గురోః
సవ్యేనసవ్యః స్ప్రష్టవ్యో దక్షిణేన చ దక్షిణః. (2-72)

గురువులకు వందనము చేయుచున్నప్పుడు వారి కుడిపాదమును తన కుడిచేతితోను, ఎడమపాదమును ఎడమచేతితోను స్పృశించుచు వందనము చేయవలయును. (తన కుడిచేయి పై గాను, ఎడమచేయి క్రిందిగాను ఉండునట్లు వారి పాదములవద్దపడి పాదములను స్పృశించవలయును.)

విద్యాగురువునకేగాక తనకంటె పెద్దలగు బంధువులకును, విద్వాంసులకును, ఇతరమహానుభావులకును ఇట్లు నమస్కరింపవలయు ననియును, నమస్కరించునపుడు తన గోత్ర, ప్రవరనామధేయములను చెప్పవలయుననియు మనువే తెలుపుచున్నాడు.

మేనమామ, పినతండ్రి, ఋత్విక్కు మున్నగుబంధువులు అట్లు నమస్కరింపదగినవారు. తనకన్న చిన్నవారైనచో వారికి సగౌరవముగా నెదురేగవలయును. నమస్కరింపరాదు. నమస్కరింపదగినవారి భార్యల కెల్ల నమస్కారము చేయవచ్చును. స్త్రీలవయస్సు లెక్కలోనికి రాదు. వారి భర్తల వయస్సే వారివయస్సుగా పరిగణింపబడినది. అన్నభార్య తనకంటె చిన్నదైనను నమస్కరింప దగినదే. అట్లే యితరుల విషయము. యువతులకు నమస్కరించునపుడు పాదస్పర్శ చేయకూడదు.

వివాదము కూడనివారు

ఎవరితోను వివాదపడరాదు. కాని ముఖ్యముగా వివాదకారణమున్నను ఈ క్రిందివారితో వివాదము పెట్టుకొనరాదు. ఋత్విక్కు, పురోహితుడు, ఆచార్యుడు, మేనమామ, ఇంటికివచ్చిన అతిథి, బాలుడు, వృద్ధుడు, రోగి, వైద్యుడు, జ్ఞాతి, వియ్యంకుడు, బంధువు, తలిదండ్రులు, అక్కచెల్లెండ్రు, అన్నదమ్ములు, పుత్రుడు, కుమార్తె, భార్య, సేవకుడు.

ఋత్వి క్పురోహి తాచార్యై ర్మాతు లాతిథి సంశ్రితైః
బాల వృద్ధాతురై ర్వైద్యైః జ్ఞాతిసంబంధి బాంధవైః

మాతాపితృభ్యాం జామిభి ర్భ్రాత్రా పుత్రేణ భార్యయా
దుహిత్రా దాసవర్గేణ వివాదం న సమాచరేత్. (4-179,180)

గురునిందను వినరాదు

తనగురువు నెవరయినను నిందించుచుండగా శిష్యు డానిందను వినకూడదు. చెవులు మూసికొనవలయును. లేదా మరియొక స్థలమునకు వెళ్ళిపోవలయును. ఆ నింద సహేతుకమైనను, అహేతుకమైనను నంతియే.

అనగా గురువుగారిలో నిజముగానున్న దోషములనుకూడ ఎవరైనను ఉద్ఘాటింపగా వినకూడదు.

గురో ర్యత్ర పరీవాదో నిందావాపి ప్రవర్తతే
కర్ణౌ తత్రపిధాతవ్యౌ గంతవ్యం వా తతోఽన్యతః. (2-200)

సమాజములో ఇతరులపట్ల సత్త్వగుణముతోను, సహనముతోను, సర్దుబాటుభావముతోను వర్తింపవలయుననుట కింతకంటెను పెద్ద యుదాహరణ ముండదు.

గౌరవాపాదకములు

సాధారణముగా మానవునకు గౌరవము కలిగించునవి ఐదు. అందు ముఖ్యమైనది విద్య. ఆ తరువాతిది కర్మాచరణము, పిమ్మట క్రమముగా వయస్సు, బంధువులు, ధనము.

విత్తం బంధు ర్వయః కర్మ విద్యాభవతి పంచమీ
ఏతాని మాన్యస్థానాని గరీయో యద్యదుత్తరమ్. (2-136)

గొప్పకుటుంబ మన నేది ?

ధనము, అధికారముగల కుటుంబములకు ఉన్నతకుటుంబములని లోకములో వ్యవహారముండగా మనువు ఉన్నతకుటుంబమునకు మరొక విధమైన నిర్వచన మిచ్చుచున్నాడు. పారమార్థిక విజ్ఞానము, మంత్రానుష్ఠానము గల్గి ధర్మమును పాటించు కుటుంబములే గొప్పవని మనువు చెప్పుచున్నాడు.

మంత్రతస్తు సమృద్ధాని కులా న్యల్పధనా న్యపి
కులసంఖ్యాం చ గచ్ఛంతి రక్షంతి చ మహద్యశః. (3-66)

సాధారణముగా లౌకికదృష్టిలో గొప్పస్థితిని పొందిన కుటుంబములతో వివాహసంబంధము చేయుట తమ్ము ఉన్నతస్థితికి గొనిపోవునని ప్రజలు తలంచుచుండగా మనువు పైని వర్ణించిన ఉన్నతకుటుంబములతో సంబంధము చేయుటయే కులోత్కర్షసంపాదకమని చెప్పుచున్నాడు.

ఉత్తమై రుత్తమైర్నిత్యం సంబంధా నాచరే త్సదా
నినీషుః కుల ముత్కర్ష మధమానధమాం స్త్యజేత్. (4-244)

రోగి, వృద్ధాదులపట్ల ప్రత్యేకాదరము

మార్గమందు రోగి యెదురుగా వచ్చుచో నాతడు పూజ్యుడుకానివాడైనను అతనికి దారినిచ్చి తప్పుకొనవలయును. స్త్రీకిని, తొంబది సంవత్సరముల వృద్ధునకును, బరువు మోయుచున్న వానికికూడ సాదరముగా దారి నీయవలయును. పెండ్లికుమారునకును, స్నాతకునకును, రథస్థునకును కూడ దారి నొసగవలయును.

చక్రిణో దశమిస్థస్య రోగిణో భారిణః స్త్రియాః
స్నాతకస్య చ రాజ్ఞశ్చ పంథా దేయో వరస్యచ. (2-138)

చాపల్యము కూడదు

తనకు సంబంధములేని ఇతరుల రహస్యములను వినగోరుట, కాలుచేతులను వ్యర్థముగా ప్రసరింపజేయుచుండుట, అసందర్భముగా వాక్కు విసరుచుండుట - ఇత్యాదులను వీడవలయును. తిన్నని నడవడిక నలవరచుకొన వలయును. ఇతరులకు అపకారము చేయు తలంపును పొందరాదు.

న పాణి పాద చపలో న నేత్ర చపలో ఒన్నృజః
న స్యాద్వాక్చపలశ్చైవ న పరద్రోహ కర్మధీః. (4-177)

జీవన సాధనములు

మానవులు జీవించుటకు పదివిధములైన పద్ధతులను మనువు అంగీకరించినాడు.

విద్యాశిల్పం భృతిః సేవా గోరక్ష్యం విపణిః కృషిః
ధృతిర్ భైక్ష్యం కుసీదం చ దశజీవన హేతవః. (10-116)

వైద్యాదివిద్యలద్వారా బ్రతుకవచ్చును. శిల్పముచే జీవింపవచ్చును. జీతమునకు కుదరవచ్చును. సేవచే బ్రతుకవచ్చును. పశుపాలనము, వ్యవసాయముకూడ అవలంబింపదగినవే. బిచ్చ మెత్తుకొనవచ్చును. వడ్డీవలన జీవింపవచ్చును. సంతోషమువలన జీవింపవచ్చును. (ఆదాయము తక్కువయినను, సంతోషము ఆ లోపమును పూరించును.)

ఇవి ఆపత్కాలములో మాత్రమే ఆశ్రయింపవలసిన జీవనమార్గములు. సాధారణసమయములలో నవలంబించవలసిన మార్గములు ఆ యా వర్ణములకు వేర్వేరుగా నుండును.

ధనాగమ మార్గములు

ఆస్తి కాని, ధనముకాని వచ్చుటకు ఏడు మార్గములను మనువు అంగీకరించినాడు:

సప్తవిత్తాగమా ధర్మ్యాదాయో లాభః క్రయోజయః
ప్రయోగః కర్మయోగశ్చ సత్ప్రతిగ్రహ ఏవ చ. (10-115)

1. వారసత్వముగా వచ్చిన బంధుధనము, 2. తన స్థలములోని గనులవలనగాని, మిత్రులవలన కాని లభించిన ధనము, 3. కొనగా వచ్చినది, 4. శత్రురాజులను జయించి తీసికొన్నది, 5. వడ్డీ, 6. వాణిజ్య వ్యవసాయములు, 7. న్యాయమైనదానము గ్రహించుట.

వడ్డీవ్యాపారము

బ్రాహ్మణ, క్షత్రియులు వడ్డీవ్యాపారము చేయరాదు. ధనాభావము చేత బాధపడుచున్నవారికి ఉపకారము చేయుటకై ధనమును ఋణముగా నీయవలసివచ్చినప్పుడు తక్కువవడ్డీకి ఋణ మీయవచ్చును.

బ్రాహ్మణః క్షత్రియో వాపి వృద్ధిం నైవ ప్రయోజయేత్
కామం తు ఖలు ధర్మార్థం దద్యాత్ పాపీయసేఽల్పికామ్.
(10-117)

వైశ్యుడుమాత్రమే ధారాళముగా వడ్డీవ్యాపారము చేయుటకు అర్హుడు. ఆతడైనను ఎక్కువవడ్డీని తీసికొనరాదు. రాజు నిర్ణయించినవడ్డీని మించి తీసికొనరాదు. రాజు వడ్డీనిర్ణయించుటలో ప్రపంచములో అన్నిదేశముల మొత్తముమీద ధనమునకు ఆ దినములలో ఎట్టివిలువ యున్నదో, ఎంతవడ్డీ న్యాయమైనదో తెలిసికొని నిర్ణయింపవలయును. సముద్రయానము చేయుచు ఆ యా దేశములను తిరుగుచు, దేశకాలార్థ పరిస్థితుల నెరిగినవారివలన ఈ సంగతులను తెలిసికొనవలయును.

సముద్రయాన కుశలా దేశకాలార్థదర్శినః
స్థాపయన్తి తు యాం వృద్ధిం సా తత్రాధిగమం ప్రతి. (8-157)

అతిథిపూజ - అన్నదానము

సంప్రాప్తా యత్వ తిథయే ప్రదద్యా దాసనోదకే
అన్నం చైవ యథాశక్తి సత్కృత్య విధిపూర్వకమ్. (3-99)

ఇంటికి వచ్చిన అతిథికి పాదప్రక్షాళనమునకు నీరిచ్చి, ఆసనము మీద కూర్చుండబెట్టి శాస్త్రోక్తముగా పూజించి భోజనము పెట్టవలెను.

తృణాని భూమి రుదకం వాక్చతుర్థీ చ సూనృతా
ఏతాన్యపి సతాం గేహే నోచ్ఛిద్యం తే కదాచన. (3-101)

సత్పురుషుల యిండ్లలో అతిథులకు విశ్రాంతిస్థానము దొరకక పోదు. ఉదకము, శయ్య లభింపకపోవు; తియ్యని పలుకులుకూడ చెవిని పడకపోవు.

పరాన్న భోజనము

ఒకని యింటికి అతిథిగా వెళ్ళి భుజించుచుండుటయే హాయిగా నుండునని తలచి యే గృహస్థుడైనను ఎల్లప్పుడును పరాన్నభోజనమునే చేయుచో అది మిక్కిలి నింద్యము. అతడు అన్నదాత యింట పశువుగా జన్మించును.

ఉపాసతే యే గృహస్థాః పరపాక మ బుద్ధయః
తే నతే ప్రేత్య పశుతాం వ్రజం త్యన్నాది దాయినామ్. (3-104)

స్వజనపోషణము ముఖ్యము

శక్తః పరజనే దాతా స్వజనే దుఃఖజీవిని
మధ్వాపాతో విషాస్వాదః స ధర్మ ప్రతిరూపకః. (11-9)

తన పితృపుత్ర కళత్రాదులు దుఃస్థితిలో నుండగా వారికై ధనము వెచ్చింపక ఇతరులకు దానము చేయుట పైకి ధర్మముగానే కన్పట్టినను

యధార్థముచేత అది అధర్మము. అది పైకి తేనెవలె మంచిదిగా కన్పట్టినను విషమువలె హాని చేయును. ఆ దాత నరకమునకే పోవును. (స్వజనము దుఃఖములో నున్నచో వారికి సహాయపడవలెనని దీని యుద్దేశమే కాని స్వజనులకు భోగములనుకూర్చుటకై యెల్లదానములను కట్టి పెట్టవలయునని కాదు.)

బ్రాహ్మణుని జీవయాత్ర

అద్రోహేణైవ భూతానా మల్పద్రోహేణ వా పునః
యా వృత్తిస్తాం సమాస్థాయ విప్రో జీవేదనాపది. (4-2)

ఎవ్వరికినీ పీడను గల్గింపకుండ బ్రాహ్మణుడు ధనము సంపాదింప వలయును. భూస్వాములు తమ కక్కరలేనిదిగా పొలములో విడిచిపెట్టి పోయిన ధాన్యమును ఏరుకొనియు, అయాచితముగా వచ్చిన దానిని తీసికొనియు జీవింపవచ్చును. అది సాధ్యము కానిచో ఎవరివద్దనైనను యాచించి తీసికొన్న దానితో జీవింపవలయును. (యాచింపగా ఇచ్చినవాడు తన ధనమును వీడునపుడు మనస్సులో కొంచెము బాధ ననుభవింపవలసి వచ్చును. కనుక ఇది రెండవ పద్ధతిగా అంగీకరింపబడినది. విద్య చెప్పి ధనము గ్రహించుటయు, యజ్ఞములను చేయించి దక్షిణలను తీసికొనుటయుకూడ బ్రాహ్మణున కంగీకరింపబడినవి.)

యాత్రామాత్ర ప్రసిద్ధ్యర్థం స్వైః కర్మభి రగర్హితైః
అక్లేశేన శరీరస్య కుర్వీత ధనసంచయమ్. (4-3)

శరీర ధారణము, కుటుంబ పోషణము, నిత్యకార్మానుష్ఠానము మున్నగునవి సాగిపోవుట కవసరమైనంతవరకే బ్రాహ్మణుడు ధనము సంపాదింపవలయును. భోగములకొరకు సంపాదింపరాదు. లోకముచే నింద్యములుకాని కర్మలచేతనే అతడు ధనమును సంపాదింపవలయును. ధనార్జనముకొరకు ఇతరులను బాధపెట్టకూడదు. అట్లే తన శరీరమునుకూడ హెచ్చుగా బాధపెట్టరాదు.

నలోకవృత్తం వర్తేత వృత్తి హేతో కథంచన

అజిహ్మామశఠాం శుద్ధాం జీవే ద్బ్రాహ్మణ జీవికామ్. (4-11)

జీవికకొరకు బ్రాహ్మణుడు ఇచ్చకములాడి యొకరిని మెప్పించుట మున్నగు పనులలోనికి దిగరాదు. వక్రమార్గములను, దంభమును పూనరాదు. తనకులేని సద్గుణములున్నట్లు ప్రకటింపరాదు. స్వచ్ఛమైన బ్రాహ్మణజీవికను ఆశ్రయింప వలయును.

సంతోషం పరమాస్థాయ సుఖార్థీ సంయతో భవేత్

సంతోషమూలం హి సుఖం దుఃఖమూలం విపర్యయః.(4-12)

కుటుంబ పోషణమునకును పంచమహాయజ్ఞాది నిత్య కర్మానుష్ఠాన మునకును అవసరమగుధనముతో బ్రాహ్మణుడు సంతోషపడి నిగ్రహము కల్గియుండవలయును. అట్లు సంతోషపడక అధికధనముకొరకు యత్నించునో పాపములు చేయవలసివచ్చును. దానివలన నరకప్రాప్తి కల్గును. సంతోషము వలన స్వర్గాదిసుఖములు లభించును.

విధాతా శాసితావక్తా మైత్రో బ్రాహ్మణ ఉచ్యతే

తస్మైనాఽకుశలం బ్రూయా న్న శుష్కాం గిరమీరయేత్.(11-35)

బ్రాహ్మణుడు ధర్మానుష్ఠానము చేసికొనుచు తన యధీనమునందున్న వారికి ధర్మము నుపదేశించుచు విజ్ఞానము నితరుల కందించుచు సర్వభూతములయందు మైత్రిని కలిగియుండవలయును. అట్టి బ్రాహ్మణునిగూర్చి కఠినోక్తులను పలుకరాదు; అమంగళముల నుచ్చరింపరాదు.

స్త్రీ గౌరవము

యత్ర నార్యస్తు పూజ్యన్తే రమన్తే తత్ర దేవతాః
యత్రైతాస్తు న పూజ్యన్తే సర్వాస్తత్రాఽ ఫలాః క్రియాః.

స్త్రీ లెక్కడ పూజింపబడుదురో దేవత లక్కడ క్రీడింతురు; స్త్రీ లెక్కడ పూజింపబడరో అక్కడ ఎన్ని సత్కార్యములు జరిగినను అవి వ్యర్థములు.

పితృభి ర్భ్రాతృభి శ్చైతాః పతిభి ర్దేవరై స్తథా
పూజ్యా భూషయిత వ్యాశ్చ బహుకళ్యాణ మీప్సుభిః.

తల్లిదండ్రులచేతను , సోదరులచేతను, భర్తలచేతను, మఱదుల చేతను స్త్రీలు పూజింపబడదగినవారు. భూషణములచే అలంకరింపదగినవారు. శుభమును గోరువారెల్లరును స్త్రీలను పూజించి భూషింపవలయును.

జామయోయాని గేహాని శపంత్య ప్రతిపూజితాః

తాని కృత్యా హతానీవ వినశ్యంతి సమంతతః. (3-58)

అక్కచెల్లెండ్రు పూజింపబడ దగినవారు; వారు పూజింపబడనివారై శపించిన గృహములు దయ్యములచేత కొట్టబడినవివలె నశించును.

దాంపత్య ధర్మము

అన్యోన్యస్యాఽవ్యభిచారో భవే దా మరణాంతికః
ఏష ధర్మః సమాసేన జ్ఞేయః స్త్రీపుంసయో స్సదా. (3-101)

మరణపర్యంతము భార్యాభర్తలు వ్యభిచరించకూడదు. సంగ్రహముగా చెప్పవలయునన్నచో నిదియే స్త్రీ పురుషుల యుత్కృష్టధర్మము.

సంతుష్టో భార్యయా భర్తా భర్త్రా భార్యా తథైవచ
యస్మిన్నేవ కులే నిత్యం కళ్యాణం తత్ర వైధృవమ్. (3-60)

ఏ యింటి భార్య భర్తతోను, భర్త భార్యతోను సంతుష్టితో నుందురో ఆ యింట నిత్యము శుభము కల్గుచుండుట నిశ్చయము.

సర్వవర్ణ సామాన్యధర్మములు

అహింసా సత్య మస్తేయం శౌచ మింద్రియనిగ్రహః
ఏతం సామాసికం ధర్మం చాతుర్వర్ణ్యేఽ బ్రవీన్ మనుః.

అహింస, సత్యము, పరద్రవ్యము నపహరింపకుండుట, పరిశుద్ధి, యింద్రియ నిగ్రహము - ఇవి నాల్గువర్ణముల వారికిని సంగ్రహముగా మనువుచే చెప్పబడిన ధర్మములు.

దురభ్యాసములు

దశకామ సముత్థాని తథాష్టౌ క్రోధజాని చ
వ్యసనాని దురంతాని ప్రయత్నేన వివర్జయేత్. (7-45)

మృగయాక్షో దివా స్వప్నః పరివాదః స్త్రియో మదః
తౌర్యత్రికం వృథాట్యాచ కామజో దశకో గణః (7-47)

పైశున్యం సాహసం ద్రోహ ఈర్ష్యాసుయార్థదూషణమ్
వాగ్దండజం చ పారుష్యం క్రోధజోపి గణోష్టకః. (7-48)

కామమువలన పుట్టిన దురభ్యాసములు పది. క్రోధమువలన పుట్టిన దురభ్యాసములు ఎనిమిది. కామమువలన పుట్టిన పది దురభ్యాసము లెవ్వియన వేట, జూదము, పగటి నిద్ర, పరదోషకథనము, పరస్త్రీసంపర్కము, మద్యపానము, నృత్యగీతవాదిత్ర వ్యసనము, వ్యర్థముగా తిరుగుట.

క్రోధమువలన కలుగు ఎనిమిది దోషము లెవ్వియన :

ఇతరులమీద లేనిపోని నేరములు చెప్పుట, సాహసము (సత్పురుషులను దండించుట), కపటముగా అపకారము చేయుట, ఇతరుల గుణములను సహింపకపోవుట, ఇతరుల గుణములయందు దోషములను చూపుట, అర్థము నపహరించుట (ఇతరుల కీయవలసినదాని నీయకుండుటకూడ), పరదూషణము, పరులను హింసించుట.

ఈ పదునెనిమిది వ్యసనములు ఎవ్వరికిని తగవు. ప్రజాశాసకుడుగా నున్న రాజునకు బొత్తిగా తగవు.

వ్యసనస్య చ మృత్యోశ్చ వ్యసనం కష్ట ముచ్యతే
వ్యసన్యధోధో వ్రజతి స్వర్యాత్యవ్యసనీమృతః. (7-53)

వ్యసనము, మృత్యువు - అనెడి రెండింటిలో వ్యసనమే చెడ్డది. వ్యసనములు కలవాడు క్రమముగా క్రిందికి పోవును. దురభ్యాసములు లేనివాడు మరణానంతరము స్వర్గాదిలోకముల కేగును.

ద్యూతం సమాహ్వయం చైవ రాజా రాష్ట్రా న్నివారయేత్
రాజ్యాంతకరణా వేతౌ ద్వౌ దోషౌ పృథివీక్షితామ్. (9-121)

ప్రాణములేని పాచికలు మున్నగువానితో నాడబడునది జూదము; కోళ్లు, పొట్టేళ్లు మున్నగు ప్రాణులతో కూడిన పందెములకు సమాహ్వాయ మని పేరు. రాజు జూదమును, సమాహ్వయమును తన రాష్ట్రములో లేకుండ చేయవలెను,

రాజు

యస్యస్తేనః పురే నాస్తి నాన్యస్త్రీగో న దుష్టభాక్
న సాహసిక దండఘ్నౌ స రాజా శక్రలోకభాక్. (8-386)

ఏ రాజుయొక్క పట్టణమందు దొంగ లేడో, పరస్త్రీగామి లేడో, చెడ్డ వాక్కులను పలుకువాడు లేడో, చెడ్డపనులకు సాహసించువాడు లేడో, ఇతరులను హింసించువాడు లేడో ఆ రాజు ఇంద్రలోకమున కేగును.

అదండ్యాన్ దండయన్ రాజా దండ్యాంశ్చైవా ప్యదండయన్
అయసో మహదాప్నోతి నరకం చై వ గచ్ఛతి. (8-128)

రాజు దండింపవలసిన వారిని దండింపక పోయినను, దండింపకూడని వారిని దండించినను అపకీర్తిని, నరకమును పొందును. (రాజునకు పక్షపాత ముండరాదు. కసి యుండరాదు.)

నహి దండా దృతే శక్యః కర్తుం పాప వినిగ్రహః
స్తేనానాం పాపబుద్ధీనాం నిభృతం చరతాం క్షితౌ. (9-263)

దొంగలయొక్కయు, లోకములో స్వేచ్ఛగా సంచరించు నితర పాపులయొక్కయు దండనము రాజునకు కర్తవ్యము. దండింపకుండ చోరాది పాపులను నిగ్రహించుట శక్యము కాదు.

త్రైవిద్యేభ్య స్త్రయీం విద్యాం దండనీతిం చ శాశ్వతీమ్
ఆన్వీక్షకీం చాత్మవిద్యాం వార్తారంభాంశ్చ లోకతః.

రాజు పండితులనుండి వేదమును, పరంపరాగతమైన రాజనీతిని, తర్కశాస్త్రమును, వేదాంతశాస్త్రమును, వాణిజ్య వ్యవసాయాది శాస్త్రములను అభ్యసించవలెను.

ఇంద్రియాణాం జయే యోగం సమాతిష్ఠే ద్దివానిశమ్
జితేంద్రియో హి శక్నోతి వశే స్థాపయితుం ప్రజాః. (7-44)

రాజు రేయింబవలు ఇంద్రియజయమును అభ్యసించవలెను. ఇంద్రియ జయము కలవాడు ప్రజలను వశమందుంచుకొనుటకు సమర్థుడగును.

రాజు తన రాష్ట్రములో నున్న శ్రోత్రియుని (వేదశాస్త్రాధ్యయనము చేసిన అనుష్ఠానపరుని) ఆదరముతో చూడవలెను. ఆతని విద్యను ప్రవర్తనను తెలిసికొని యాతనికి ధర్మసమ్మతమైన జీవితమును కల్పించవలెను. తండ్రి కుమారుని రక్షించున ట్లాతనిని చోరాదులనుండి రక్షింపవలెను.

ఈ రీతిగా శ్రోత్రియుడు రాజుచే రక్షింపబడినవాడై యే ధర్మమును నిత్యము చేయుచున్నాడో దానిచేత రాజుయొక్క అయువు, ధనము, రాజ్యము వృద్ధినొందును.

శ్రుతవృత్తే విదిత్వాస్య వృత్తిం ధర్మ్యాం ప్రకల్పయేత్
సంరక్షే త్సర్వతశ్చైనం పితాపుత్ర మివౌరసమ్. (7-135)

సంరక్షమాణో రాజ్ఞాయం కురుతే ధర్మ మన్వహమ్
తే నాయుర్వర్ధతే రాజ్ఞో ద్రవిణం రాష్ట్రమేవ చ. (7-136)

రాజునకు రాగద్వేషము లుండకూడదనియు, దయాదాక్షిణ్యము లుండవలెననియు గుర్తింపవలెను.

సర్వేషాం తు విదిత్వైషాం సమాసేన చికీర్షితమ్
స్థాపయే తత్ర తద్వంశ్యం కుర్యాచ్చ సమయక్రియామ్.(7-202)
జిత్వా సంపూజయే ద్దేవాన్ బ్రాహ్మణాం శ్చైవ ధార్మికాన్
ప్రదద్యాత్ పరిహారాం శ్చ ఖ్యాపయే దభయాని చ. (7-201)

రాజు తాను జయించిన రాష్ట్రములో మంత్రులు మున్నగువారి అభిప్రాయములను బాగుగా తెలిసికొని ఆ జయింపబడిన రాజుయొక్క వంశస్థుని రాజ్యమునకు పట్టాభిషిక్తుని చేయవలెను.

తాను జయించిన రాజ్యములో నున్న ముఖ్యాలయములలోని దేవతలను, ధార్మికులైన బ్రాహ్మణులను పూజించి యుద్ధములో కలిగిన నష్టములకు గాను ఆ దేశస్థులకు నష్టపరిహారము నొసగి అదివరకు రాజభక్తిచేత ఎవరు యుద్ధము చేసినారో వారికి అభయము నొసగవలెను. (తనతో యుద్ధము చేసినవారిని దండింపకూడదు.)

రాజెన్నడును కపటముగా వ్యవహరింప కూడదు. శత్రువులు తనపట్ల ప్రయోగించు మాయనుమాత్రము రహస్యముగా తెలిసికొనుచు దానికి ప్రతీకారము చేసికొనుచుండవలెను.

అమాయయైవ వర్తేత న కథంచన మాయయా
బుద్ధ్యేతారి ప్రయుక్తాం చ మాయాం నిత్యం స్వసంవృతః.(7-104)

రాజు యుద్ధమునకు సిద్ధముగా లేని శత్రువు నెన్నడును కొట్టరాదు. యుద్ధాభిముఖుడైన వానినికూడ కపటాయుధములచే కొట్టరాదు.

న కూటై రాయుధైర్హన్యా ద్యుధ్యమానో రణే రిపూన్
కర్ణికారై ర్నాపి దిగ్ధైర్నాగ్నిజ్వలిత తేజసైః. (7-90)

రాజు యుద్ధమందు శత్రువును కపటాయుధములచేతను (పైకి కొయ్యముక్కలవలెకట్టి లోపల వాడియైన శస్త్రములుగల ఆయుధముల చేతను కర్ణికారములతో గూడిన (కొండగోగుతో గూడిన) బాణములచేతను, మంటలను రేపు బాణములచేతను, విషముతో కూడుకొన్న బాణములచేతను కొట్టకూడదు.

బలవంతుడు బలహీనునివద్ద బలాత్కారముగా నేదైన తీసికొన్నచో దానిని రాజు చెల్లనీయకూడదు. బలవంతుడు బలహీనుని నాక్రమించుకొని సస్యము ననుభవించినను, ఆ యనుభవించబడిన పంటను భూమిని కూడ రాజు ఆ బలహీనున కిప్పింపవలయును. బలవంతముగా వ్రాయించుకొన్న అన్యాయములయిన ఋణపత్రాదులను రాజు చెల్లనీయకూడదు.

బలాద్దత్తం బలాద్భుక్తం బలాద్యచ్చాపి లేఖితమ్
సర్వాన్ బలకృతా నర్థానకృతాన్ మను రబ్రవీత్. (7-168)

ఈరీతిగా రాజు దుర్బలులకు బలముగా నుండవలయును.

రాజు ప్రజల కామితవస్తువులను వర్షించుచు ఇంద్రసముడు కావలయును; సూర్యకిరణము లుదకమును లాగుకొనునట్లు నెమ్మదిగా పన్నులను తీసికొని సూర్యసాదృశ్యము నొందవలయును; రాజ్య మంతటను తన శక్తిచే వ్యాపించి వాయువ్రతుడు కావలయును; అప్రియులు, ప్రియులు నను భేదములేకుండ నెల్లరిని సమానముగా నియమించుచు యమవ్రతము నాచరింపవలయును; పాపులను పాశముచే బంధించి వరుణతుల్యుడు కావలయును; ఎల్లరను ఆహ్లాదపఱచుచు చంద్రనిభుడు కావలయును; దుష్టసామంతులను తపింపచేయుచు ఆగ్నేయవ్రతుడు కావలయును; ఎల్లరను సమానముగా ధరించుచు పృథివీసంకాశుడు కావలయును.

ఇంద్ర స్యార్కస్య వాయోశ్చ యమస్య వరుణస్య చ
చంద్ర స్యాగ్నేః పృథివ్యాశ్చ తేజోవృత్తం నృపశ్చరేత్.
(9-303 నుండి 311)

ధనము సంపాదించుకొనజాలని స్థితిలో నున్నవారికిని, ధర్మకార్యములకు ధనము నపేక్షించు వారికిని, బాధలోనున్న వారికిని ధనరూపమైన సహాయము చేయుట సమాజముయొక్క ధర్మము.

సాంతానికం యక్ష్యమాణ మధ్వగం సర్వవేదసమ్
గుర్వర్థం పితృమాత్రర్థం స్వాధ్యాయా ర్థ్యుపతాపినః.
న వైతాన్ స్నాతకాన్ విద్యాద్బ్రాహ్మణాన్ ధర్మభిక్షుకాన్
నిస్స్వే భ్యోదేయమేతేభ్యోదానం విద్యావిశేషతః. (11-1,2)

వివాహమాడ గోరువాడు, యజ్ఞము చేయగోరువాడు, మార్గస్థుడు సర్వధనము దక్షిణగా యజ్ఞములో నిచ్చివేసినవాడు, గురువుగారికి దక్షిణ నొసగగోరువాడు, తల్లిదండ్రులను పోషింపవలసినవాడు, బ్రహ్మచర్యాశ్రమములో నుండి వస్త్రాద్యావశ్యకవస్తువులను కోరువాడు, రోగి, ధనహీనులైన యీ తొమ్మండుగురు దానము పొందుటకు ముఖ్యముగా అర్హులు. వీరిలోని విద్యావిశేషమును బట్టి దానాధిక్య ముండదగును.

మనువు దానముచేయుట ననేకస్థలములలో ప్రశంసించియున్నాడు. ఎట్టివారు దానము పొందుట కర్హులోకూడ చెప్పినాడు. దీనులపట్లను, అనాథులపట్లను పక్షపాతము ఎల్లయెడలను కన్పట్టును.

గర్భిణీతు ద్విమాసాది స్తథా ప్రవ్రజితో మునిః
బ్రాహ్మణాలింగిన శ్చైవ న దాప్యాస్తారికం తరే. (8-407)

నదుల రేవులను దాటునపుడు ఈయవలసిన డబ్బునకు తారికమని పేరు. ఈ తారికమును తీసికొనకుండగనే నావికుడు గర్భిణీస్త్రీని రేవు దాటించవలయును. (రెండు మాసముల గర్భవతియైన స్త్రీ తారికము నీయనక్కరలేదు.) బ్రహ్మచారులు, వానప్రస్థులు, సన్యాసులు, బ్రాహ్మణులు కూడ తారికము నీయనక్కరలేదు.

ఇట్టి సందర్భము లన్నింటిలోను కన్పట్టు భావములు రెండు :
1. ధనార్జనమున కవకాశములేని వారిపట్ల ఉదారదృష్టిని వహింపవలయును.
2. ఆర్తిలో నున్నవారికి సహాయముచేయుట పరమకర్తవ్యము.

ఆర్థికాది కారణములచేత తమయింట వంటచేసికొని భుజింపజాలని వారికి యథాశక్తిగా గృహస్థుడు అన్నము పెట్టవలయునని మనువు చెప్పుచున్నాడు.

శక్తితో పచమానేభ్యో దాతవ్యం గృహమేధినా. (4-32)

ధనసేకరణమునకు అందరికంటె ఎక్కువ అవకాశములుగల వైశ్యుని ధర్మమును నిర్దేశించుచు మనువిట్లు చెప్పుచున్నాడు.

ధర్మేణ ద్రవ్యవృద్ధా వాతిష్ఠేద్యత్న ముత్తమమ్
దద్యాచ్చ సర్వభూతానా మన్నమేవ ప్రయత్నతః. (9-333)

వైశ్యుడు ధర్మబద్ధమైన పద్ధతిలో ధనమును వృద్ధిచేసికొనుచుండ వలయును. ఎల్లరకును అన్నదానము చేయుటకు యత్నించుచుండవలయును. ధనము నిచ్చుటకంటె ఆహారమునిడుట మంచిదని యెరుంగవలయును.

ఆ యా వర్ణములవారికి విధింపబడిన వృత్తులు చివరకు సార్వజనిక క్షేమకరములనునది చాలదు. సద్యఃకాలములో ప్రతిమానవుడును సార్వజనిక దృష్టితో వ్యవహరించుచుండవలయునని యాదేశము. వైశ్యునకు విశేషముగా విధింపబడిన యీ యన్నదానము సర్వవర్ణ గృహస్థులకు కూడ విధింపబడినది.

సమాజక్షేమమునకు వ్యతిరేకముగా దుష్టచర్యలు గావించువారిని మనువు ఆతతాయి శబ్దముచే వ్యవహరించి అట్టి ఆతతాయి, బ్రాహ్మణుడైనను, బాలుడైనను కూడ సంహరింపదగినవాడేయని చెప్పుచున్నాడు (8-530). రాజోద్యోగములోనుండి, కార్యార్థులైన ప్రజలనుండి, లంచములను తీసికొను వారిని సమాజద్రోహులనుగా మనువు గణించినాడు. మరియు ప్రజలను భయపెట్టి ధనమును లాగుకొనువారు, జూదరులు, మోసగాండ్రు, ధనప్రాప్తి, సంతానప్రాప్తి మున్నగువానిని గురించి ప్రజలకు భవిష్యత్తును చెప్పువారు, పైకి కల్యాణవేషములను వేసికొని పాపములను కప్పుకొనువారు, రేఖాసాముద్రికమును చూచి చెప్పువారు, గజశిక్షలోను, వైద్యములోను జీవితమును గడుపుచు ఆ విద్యలో ప్రావీణ్యము లేనివారు, ఆరితేరిన వేశ్యలు - వీరివలన ప్రజలు నష్టపోకుండునట్లు చూచుట రాజవిధి యని మనువు నుడువుచున్నాడు.


ఉత్కోచ కాశ్చోపధికా వంచకాః కితవా స్తథా
మంగళా దేశవృత్తా శ్చ భద్రాశ్చే క్షణికై స్సహ. (9-258)

శ్రద్ధయేష్టం చ పూర్తం చ నిత్యం కుర్యా దతంద్రితః
శ్రద్ధాకృతే హ్యక్షయేతే భవతః స్వాగతైర్ధనైః. (4-226)

నిత్యము ఇష్టాపూర్తములను శ్రద్ధతో నాచరింపవలయును. న్యాయార్జితమైన ధనముతో శ్రద్ధగా చేయబడిన ఇష్టాపూర్తములు మోక్షఫలము నొసగును.

దేవతలకు తృప్తిని గల్గించు కర్మలకు ఇష్టములనియు, మానవ సమాజమునకు సుఖమును గల్గించు కార్యములకు పూర్తములనియు పేర్లు వేదములలోనే కన్పట్టుచున్నవి. ఈ పరభాష మనువులోను కన్పట్టుచున్నది. ప్రజాసామాన్యముకొరకు తోటలను వేయించుట, వాపీకూప తటాకాదులను త్రవ్వించుట మున్నగు పౌర్తిక కర్మలను ఐష్టికములతోబాటు విధించుటవలననే మనువు సమాజసేవ కెట్టిస్థానము నిచ్చినాడో తెలియగలదు.

దానధర్మం నిషేవేత నిత్యమైష్టిక పౌర్తికమ్. (4-227)



3. ఆచారము

విపుల కర్మకలాపముతో కూడుకొన్న అనుష్ఠేయాంశములకు ఆచార శబ్ద మీ ప్రకరణమున వాడబడుచున్నది. ఆచారము విధిరూపముగానైనను, నిషేధరూపముగానైనను ఉండవచ్చును.

ఆచార ప్రాముఖ్య మెట్టిదన:-

ఆచారా ద్విచ్యుతో విప్రో న వేదఫల మశ్నుతే
ఆచారేణ తు సంయుక్తః సంపూర్ణఫల భాగ్భవేత్. (1-109)

ఆచారమునుండి జారిపోయిన బ్రాహ్మణుడు వేదాధ్యయనము చేసినను దానిఫలమును సరిగా పొందజాలడు. ఆచారముతోకూడినవాడు పూర్ణఫలమును పొందును.

అనభ్యాసేన వేదానా మాచారస్య చ వర్జనాత్
ఆలస్యా దన్నదోషా చ్చ మృత్యుర్విప్రాన్ జిఘాం సతి.(5-4)

సాధారణముగా మృత్యువు బ్రాహ్మణులను పట్టు కొనుటకు సాహసింపదు. కాని వేదాధ్యయనము మానివేయుట వలనను, కర్తవ్యముపట్ల సోమరితనము వలనను, ఆచారములను వీడుటవలనను, అహారదోషమువలనను వారిని మృత్యువు మ్రింగగోరుచున్నది.

ఇచట ఆచారములేనిచో వేదాభ్యాసము, బ్రాహ్మణత్వముకూడ తేజస్సును కోల్పోవుననుటనుబట్టి ఆచారము బ్రాహ్మణులకు మాత్రమే విహితమని తలంపరాదు. అన్ని వర్ణములవారును ఆచారములను పాటింపవలసినదే. ప్రత్యేకముగా నా యా వర్ణములను నిషేధింపబడిన ధర్మములు తప్ప మిగిలినవి బ్రాహ్మణుల నుద్దేశించి చెప్పబడినను కూడ నితరు లాచరింపదగినవే యని మనువు చెప్పియున్నాడు.

ధర్మేప్సవస్తు ధర్మజ్ఞా స్సతాం వృత్త మనుస్థితాః
మంత్రవర్జ్యం న దుష్యన్తి ప్రశంసాం ప్రాప్నువన్తిచ.(10-127)

ఏ శూద్రులు ధర్మమును తెలిసికొన్నవారై తమకు ప్రత్యేకముగా నిషేధింప బడనట్టియు, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకు విధింపబడినట్టియు కర్మల నాచరింప గోరుదురో, అట్టివారు దోషమును పొందరు. పైగా స్తుతింపబడుదురు. ఎట్లన శూద్రులుకూడ నమస్కారమంత్రసహితముగాను, ఇతర మంత్రరహితము గాను పంచమహాయజ్ఞములను ఆచరింపవలయును. అట్లే ఇతర ధర్మములను గురించి తెలియనగును.

యథా యథా హి సద్వృత్త మాతిష్ఠ త్యనసూయకః
తథా తథే మం చాముం చ లోకం ప్రాప్నో త్యనిందితః(10-128)

శూద్రుడు ఇతరులను నిందింపనివాడై ద్విజుల మంచియాచారముల ననుష్ఠింపవచ్చును. అట్లనుష్ఠించుచే నాతడు నిందార్హుడు కాడు, పైగా ఇహపర సౌఖ్యములను పొందగల్గును.

సామాన్యముగా గృహస్థులు పాటింపవలసిన కొన్ని ఆచారములు

క్లప్త కేశ న ఖశ్మశ్రు ర్దాంతః శుక్లాంబర శ్శుచిః
స్వాధ్యాయే చైవ యుక్తః స్యాన్నిత్యమాత్మ హితేషు చ. (4-35)

గృహస్థుడు తెల్లనివస్త్రములను ధరింపవలయును. పరిశుభ్రముగా నుండవలయును. అప్పుడప్పుడు వ్రతాదుల కవసరమయిన ఉపవాసములు స్నానములు మున్నగువానిని తట్టుకొనగల శారీరక మానసిక శక్తిని గల్గియుండవలయును. కారణములేకుండా గోళ్ళను, గడ్డమును, మీసమును పెరగనీయకూడదు. వేదాభ్యాసమును వీడరాదు. ఆధ్యాత్మికచింతన గల్గియుండ వలయును.

నే క్షేతో ద్యంతమాదిత్యం నాస్తం యంతం కదాచన
నోపసృష్టం చ వారిస్థం న మధ్యం నభసో గతమ్. (4-37)

ఉదయించుచున్న సూర్యుని, అస్తమించుచున్న సూర్యుని చూడకూడదు. గ్రహణము పట్టినప్పుడు కూడ సూర్యుని చూడకూడదు. మధ్యాహ్నసమయమున నెత్తిపై నున్నపుడుకూడ చూడరాదు. నీటిలో ప్రతిబింబించిన సూర్యుని చూడరాదు.

న లంఘయే ద్వత్సతంత్రీం న ప్రధావేచ్చ వర్షతి
న చోదకే నిరీక్షేత స్వంరూప మితిధారణా. (4-38)

దూడను కట్టిన త్రాటిని దాటరాదు. వర్షములో పరుగెత్తరాదు. నీటిలో తన ప్రతిబింబమును చూచుకొనరాదు.

రజసాభిప్లుతాం నారీం నరస్య హ్యుపగచ్ఛతః
ప్రజ్ఞా తేజోబలం చక్షు రాయుశ్చైవ ప్రహీయతే. (4-41)
నోపగచ్ఛే త్ప్రమత్తోపి స్త్రియ మార్తవదర్శనే
సమానశయనే చైవ న శయీతతయా సహ. (4-40)

బహిష్ఠయైన స్త్రీని పొందకూడదు. పొందువానికి ప్రజ్ఞ నశించును. తేజస్సు, బలము, చూపు, ఆయువుకూడ నశించును.

నాశ్నీయా ద్భార్యయాసార్థం నై నామీక్షేత చాశ్నతీమ్
నక్షువతీం జృంభణాం వా న చాసీనాం యథాసుఖమ్(4-43)

భార్యతో కలసి భోజనము చేయరాదు. భార్య భోజనము చేయుచున్నపు డామెను చూడకూడదు. ఆవులించునపుడు, తుమ్మునపుడు, స్వేచ్ఛగా విశ్రాంతికై కూర్చున్నపుడుకూడ ఆమెను చూడరాదు.

నాన్నమద్యాదేకవాసా న నగ్నః స్నానమాచరేత్
న మూత్రం పథికుర్వీత న భస్మనిన గోవ్రజే. (4-45)

పై బట్ట లేకుండ భోజనము చేయరాదు. వస్త్రవిహీనుడై స్నానము చేయరాదు. (నిద్రపోరాదని కూడ స్థలాంతరమున కలదు.) నలుగురు నడచు దారిలో, భస్మములో, గోశాలలో మూత్రపురీషమును విడువరాదు.

న ఫాలకృష్టే న జలే న చిత్యాం నచ పర్వతే
న జీర్ణదేవాయతనే న వల్మీకే కదాచన.

న స సత్త్వేషు గర్తేషు న గచ్ఛన్నపి చ స్థితః
న నదీతీర మాసాద్య న చ పర్వతమస్తకే.

వాయ్వగ్ని విప్రమాదిత్యమపః పశ్యం స్తథైవ గాః
న కదాచ న కుర్వీత విణ్మూత్రస్య విసర్జనమ్.

తిరస్కృత్యోచ్ఛ రేత్కాష్ఠం లోష్టపత్రతృణాదినా
నియమ్య ప్రయతోవాచం సంవీతాం గోవగుంఠితః.

మూత్రోచ్చార సముత్సర్గం దివా కుర్యా దుదఙ్ముఖః
దక్షిణాభిముఖో రాత్రౌ సంధ్యయోశ్చ యథా దివా.
(4-46 నుండి 50)

ప్రత్యగ్నిం ప్రతిసూర్యం చ ప్రతిసోమోదక ద్విజాన్
ప్రతిగాం ప్రతివాతం చ ప్రజ్ఞానశ్యతి మేహతః. (4-52)

పొలములోను, నీటిలోను, అగ్నిహోత్రముకొరకేర్పరచిన చితిలోను, పర్వతశిఖరాగ్రముననను, జీర్ణదేవాలయములోను, పుట్టలోను, పురుగు పుట్రకల నెరదలలోను, బొరియలలోను, నదీతీరమందును మూత్రపురీషోత్సర్జనము చేయ రాదు. నడచుచుకాని, నిలబడికాని కూడ చేయరాదు.

అగ్నిని, బ్రాహ్మణుని, వాయువుచే కదలుచెట్లను, సూర్యుని, నీటిని, గోవులను చూచుచు మూత్రపురీషోత్సర్జనము చేయరాదు.

మూత్రపురీషోత్సర్జన సమయమున మాట్లాడరాదు. శరీరమును శిరస్సును వస్త్రముచే కప్పుకొనవలయును. ఎంగిలితో నుండరాదు. ఎండుకట్టెలతో కాని, ఎండుగడ్డితో కాని, మట్టిపెల్లతో కాని ఆ ప్రదేశమును కప్పవలయును.

పగటిపూట మలమూత్రములను ఉత్తరాభిముఖుడై విడువవలయును; రాత్రి దక్షిణాభిముఖుడుగా నుండవలయును సంధ్యలయందు పగటియందువలెనే ఉత్తరాభిముఖముగా నుండవలయును. (సంధ్యా సమయములలో మూత్ర పురీషోత్సర్జనము చేయకూడదను నిషేధమును ఈ శ్లోకము తుడిచి పెట్టదు, నిషేధమున్నను ఒక వేళ తప్పనిసరిగ చేయ వలసివచ్చుచో ఉత్తరాభిముఖుడుగా చేయవలయునని భావము.)

అగ్నికిని, సూర్యునకును, చంద్రునకును, నీటికిని, బ్రాహ్మణునకును, గోవునకును, గాలికిని ఎదురుగా ఉత్సర్గము చేయువానికి ప్రజ్ఞ నశించిపోవును. కావున అట్లు చేయరాదు.

మృదంగాం దైవతం విప్రం ఘృతం మధు చతుష్పథమ్
ప్రదక్షిణాని కుర్వీత ప్రజ్ఞాతాం శ్చ వనస్పతిన్. (4-39)

ప్రయాణముచేయుచున్న సమయములో దేవతావిగ్రహము, గోవు త్రవ్వి కుప్ప వేయబడిన మన్ను, బ్రాహ్మణుడు, నేయి, తేనె. చతుష్పథము, సువిఖ్యాత వృక్షము కన్పట్టుచో ప్రదక్షిణము చేయవలయును.

నాగ్నిం ముఖేనోపథమే న్నగ్నాం నేక్షేత చ స్త్రియమ్
నామేధ్యం ప్రక్షిపేదగ్నౌ న చ పాదౌ ప్రతాపయేత్. (4-53)

నిప్పును నోటితో ఊదకూడదు, వస్త్రరహితయైన స్త్రీని చూడకూడదు. అమేధ్యమును అగ్నిలో వేయరాదు. కాళ్ళను నిప్పుతో కాచుకొన రాదు.

అధ స్తాన్నోపదధ్యాచ్చ న చైన మభిలంఘయేత్
న చైనం పాదతః కుర్యాన్న ప్రాణాబాధ మాచరేత్. (4-54)

మంచంక్రింద నిప్పుకుంపటి నుంచరాదు. నిప్పును దాటకూడదు. పండుకొని కాళ్ళదిక్కున నిప్పు నుంచుకొనరాదు. ప్రాణమునకు బాధ తెచ్చు పనిని చేయరాదు.

నాశ్నీయా త్సంధివేళాయాం న గచ్ఛేన్నాపి సంవిశేత్
న చైవ ప్రలిఖేద్భూమిం నాత్మనోప హరేత్స్రజమ్. (4-55)

సాయం ప్రాత స్సంధ్యాసమయములలో ఆహారము తీసికొనరాదు; ఎక్కడికి వెళ్ళకూడదు; ఊరక గీతలు గీయరాదు; తన మెడలోని పూలదండను తానే తీసివేయకూడదు. (ఎవరిచేత నైనను తీయించుకొనవలయును.)

నైకః సుప్యాచ్ఛూన్యగేహే శ్రేయాంసం న ప్రబోధయేత్
నోదక్యయాఽభిభాషేత యజ్ఞం గచ్ఛేన్న చావృతః. (4-57)

పాడుపడిన యింటిలో ఒక్కడును నిద్రింపరాదు. తన కంటె గొప్ప వారిని నిద్రనుండి సాధారణముగ లేపరాదు. బహిష్ఠస్త్రీతో మాట్లాడరాదు. యజ్ఞమునకు ఋత్విక్కుగా నుండవలసినదని ఆహ్వానింపబడకుండ ఆర్త్విజ్యాశతో వెళ్ళరాదు. (యజ్ఞమును దర్శించుటకు పిలుపు అక్కర లేదు.)

న వారయేద్గాంధయన్తీం న చా చక్షీత కస్యచిత్
న దివీంద్రాయుధం దృష్ట్వా కస్య చిద్దర్శయేద్బుధః. (4-59)

ఆవుదూడ పాలు కుడుచుచుండగా అడ్డకూడదు; ఎవరికిని చెప్పకూడదు. ఆకాశమున ఇంద్రధనుస్సును చూచి యింకొకరికి చూపకూడదు.

న భుంజీతో ద్ధృతస్నేహం నాతిసౌహిత్య మాచరేత్
నాతిప్రగే నాతిసాయం న సాయం ప్రాతరాశితః (4-62)

తెలకపిండి తినకూడదు. ఆహారమును ఎక్కువగా తినకూడదు. (జఠరములో సగము మాత్రమే ఆహారమును నింపవలయును. నాల్గవ వంతును నీటితో నింపవలయును మిగిలిన నాల్గవభాగమును వాయు సంచారమునకు విడిచిపెట్టవలయునని విష్ణుపురాణము చెప్పుచున్నది.) సూర్యోదయ సూర్యాస్తమయములయందు భోజనము చేయరాదు. ఉదయము ఎక్కువగా తిన్నచో సాయంకాల భోజనము మానవలయును.

న కుర్వీత వృథాచేష్టాం న వార్యం జలినా పిబేత్
నోత్సంగే భక్షయే ద్భక్ష్యాన్న జాతుస్యా త్కుతూహలీ (4-63)

వ్యర్థమైనపనులు చేయరాదు. (అనగా తాను చేయుపని ధర్మమునకో ధర్మవిరుద్ధములు కాని అర్థకామములకో ఉపయోగించునదిగా నుండ వలయును.)

అంజలితో నీరు త్రాగరాదు. ఏ వస్తువును ఒడిలోపెట్టుకొని తినరాదు. తన కక్కరలేని విషయములను తెలిసికొనవలయునను కుతూహల ముండకూడదు.

ఉపానహౌచ వాసశ్చ ధృతమన్యై ర్నధారయేత్
ఉపవీత మలంకారం స్రజం కరక మేవ చ. (4-66)

ఇతరులు ధరించి విడిచిన పాదరక్షలను, వస్త్రమును, యజ్ఞోపవీతమును, అలంకారమును, పుష్పమాలను, కమండలమును ధరింపరాదు.

వినీతైస్తు వ్రజేన్నిత్య మాశుగైర్లక్షణాన్వితైః
వర్ణరూపోప సంపన్నైః ప్రతోదేనా తు దన్‌భృశమ్. (4-68)

బండిమీద వెళ్ళవలసినచో చెప్పినట్లు వినునట్టియు, వేగముగా నడచునట్టియు, శుభలక్షణములు గల్గినట్టియు, చక్కని రంగు రూపము గల్గినట్టియు, ఎద్దులనుపూన్చిన బండిమీద వెళ్లవలయును. ఎద్దులను కొట్టి పీడించకూడదు.

బాలాతపః ప్రేతధూమో వర్జ్యం భిన్నం తథాసనమ్
నచ్ఛింద్యాన్నఖలోమాని దన్తైర్నోత్పాటయే న్నఖాన్.

లేతఎండ, శవధూమము, విరిగిపోయిన ఆసనము - ఇవి తగవు. ఎప్పుడుపట్టిన నప్పుడు తలవెంట్రుకలను, గోళ్లను త్రుంపి వేయుచుండరాదు. దంతములతో గోళ్ళను కొఱకరాదు.

లోష్టమర్ది తృణచ్ఛేదీ నఖఖాదీచయో నరః
సవినాశం వ్రజత్యాశు సూచకోఽశుచిరేవచ. (4-71)

ఊరక మట్టిని మర్దించువాడు, గడ్డిపరకలను త్రుంచువాడు; చేతి గోళ్లను తినువాడు, ఎదుటివానిలో ఉన్నదోషములను కాని, లేనిదోషములను కాని వెల్లడించుచుండువాడు, శుభ్రత లేనివాడు - వీరు శీఘ్రముగా వినాశము పొందుదురు.

అద్వారేణ చ నాతీయా ద్గ్రామం వా వేశ్మవాఽవృతమ్
రాత్రౌచ వృక్షమూలాని దూరతః పరివర్జయేత్. (4-73)

ప్రాకారముగల్గిన గ్రామమునుగాని, ఇంటినికాని ద్వారముగుండ ప్రవేశింపవలయునేకాని ప్రాకారముదాటి ప్రవేశింపకూడదు. రాత్రులందు చెట్లక్రింద నుండరాదు, దూరముగా నుండవలయును.

అధితిష్ఠేన్న కేశాంస్తు న భస్మాస్థి కపాలికాః
న కార్పాసాస్థి న తుషాన్ దీర్ఘమాయుర్జిజీవిషుః. (4-78)

దీర్ఘకాలము బ్రదుకగోరువాడు కేశములను, భస్మమును, ఎముకలను, కుండపెంకులను, దూదిని, ధాన్యపుఊకను త్రొక్కరాదు.

న సంహతాభ్యాం పాణిభ్యాం కండూయేదాత్మనః శిరః
న స్పృశేచ్చైత దుచ్ఛిష్టో న చ స్నాయాద్వినా శిరః. (4-82)

రెండుచేతులతోను తల గోకికొనకూడదు. ఎంగిలిచేతులతో తలను ముట్టుకొనకూడదు. శిరస్సునువిడిచి కేవలము కంఠస్నానము చేయరాదు. (శిరః స్నానము ఆరోగ్యభంగకరమైనపుడు కంఠస్నానము చేసియే కర్మానుష్ఠానము చేసికొనవచ్చునని జాబాలి వచనము.)

నాక్షైః క్రీడేత్కదాచిత్తు స్వయం నోపాన హౌహరేత్
శయనస్థో న భుంజీత న పాణిస్థం న చాసనే. (4-74)

ఎప్పుడును పాచికలు (జూదము) ఆడకూడదు. పరిహాసము కొరకుకూడ ఆడకూడదు. పాదరక్షలను చేతితో మోసికొనిపోరాదు. ప్రక్కమీద కూర్చుండి యేమియు తినరాదు. చేతిలో భోజ్యవస్తువును పెట్టుకొని కొంచెము కొంచెముగా తినుచుండుట కూడదు. ఆసనముమీద పెట్టుకొని యేవస్తువును తినరాదు.

సర్వం చ తిలసంబద్ధం నాద్యాదస్తమితే రవౌ
న చ నగ్నశ్శయీతేహ న చోచ్ఛిష్టః క్వచిద్వ్రజేత్. (4-75)

రాత్రిపూట నువ్వులతోగూడిన యే వస్తువును భుజింపరాదు. వస్త్రవిహీనుడై శయనింపరాదు. ఎంగిలితో నెక్కడకును వెళ్ళరాదు.

ఆర్ద్రపాదస్తు భుంజీత నార్ద్రపాదస్తు సంవిశేత్
ఆర్ద్రపాదస్తు భుంజానో దీర్ఘమాయు రవాప్నుయాత్. (4-76)

తడిగానున్న కాళ్ళుగలవాడై భోజనము చేయవలయును . దాని వలన దీర్ఘాయువు కల్గును. తడికాళ్ళతో పండుకొనరాదు.

భోజన విధి

ఉపస్పృశ్య ద్విజోనిత్య మన్న మద్యాత్సమాహితః
భుక్త్వాచోప స్పృశేత్సమ్య గద్భిః ఖానిచ సంస్పృశేత్. (2-53)

బ్రాహ్మణుడు భోజనమునకు పూర్వమునను, పరమందును ఆచమనము చేసి ఉదకముతో శిరస్సులోనున్న ఘ్రాణచక్షుఃశ్రోత్రాదీంద్రియములను స్పృశింపవలయును.

పూజయే దశనం నిత్య మద్యాచ్చై తదకుత్సయన్
దృష్ట్వా హృష్యేత్ప్రసీదేచ్చ ప్రతినందేచ్చ సర్వశః.

పూజితం హ్యశనం నిత్యం బలమూర్జం చ యచ్ఛతి
అపూజితం తు తద్భుక్తముభయం నాశయేదిదమ్. (2-54,55)

ఎల్లప్పుడును అన్నమును పూజింపవలయును; నిందింపకూడదు. అన్నమునుచూచి సంతోషమును, ప్రసన్నతను పొందవలయును, అభినందింప వలయును. (ఈ యన్నమువలన ప్రాణధారణ సాధ్యమగుచున్నదను భావము నుంచుకొనవలయునని ఆదిత్యపురాణము చెప్పుచున్నది. ఈ భావమే ప్రాణాహుతుల రూపముగా శిష్టాచారములో వ్యక్తమగుచున్నది. దేవతానివేదితము కాకుండ అన్నము భుజింపరాదని స్థలాంతరమున చెప్పబడినది.) పూజింప బడినదియై అన్నము బలమును సామర్థ్యమును ఇచ్చును. పూజింపబడనిదై యా రెంటిని నాశనము చేయును.

నోచ్ఛిష్టం కస్య చిద్దద్యా న్నాద్యాచ్చైవ తథాన్తరా
న చైవాత్యశనం కుర్యా న్న చోచ్ఛిష్టః క్వచిద్వ్రజేత్.

అనారోగ్య మనాయుష్య మస్వర్గ్యం చాతి భోజనమ్
అపుణ్యం లోకవిద్విష్టం తస్మాత్త త్పరి వర్జయేత్. (2-57,58)

ఎంగిలి ఎవరికిని పెట్టకూడదు. పగటి భోజనమునకును రాత్రి భోజనమునకును నడుమ భుజింపకూడదు. ఎక్కువ భుజింపకూడదు. అతిభోజనము ఆయురారోగ్యములకు భంగకరము. స్వర్గప్రతిబంధకము, పాపావహము, లోకగర్హితము. ఎంగిలితో నెక్కడకును వెళ్ళకూడదు. ఎంగిలితో నుండి బ్రాహ్మణుని, గోవును, అగ్నిని తాకరాదు. మరియు సూర్యచంద్ర నక్షత్రాదులను చూడరాదు. (4-42)

యద్వేష్టిత శిరాభుంక్తే యద్భుఙ్క్తే దక్షిణాముఖః
సోపానత్కశ్చ యద్భుఙ్క్తే తద్వై రక్షాంసి భుంజతే. (3-238)

తలకు గుడ్డకట్టుకొనికాని, కాలిజోడుతోకాని భుజింపరాదు. దక్షిణాభిముఖముగా భుజింపరాదు. (తూర్పుముఖముగా భుజించుట మంచిది.) బ్రాహ్మణు లన్నము తినుచుండగా పందికాని, కోడికాని, కుక్కకాని, బహిష్ఠస్త్రీకాని, నపుంసకుడుకాని చూడకూడదు. అన్నమును పంది వాసన చూచుచో చెడిపోవును. కోడియొక్క రెక్కలగాలి తగులుచో చెడును. కుక్క చూపుపడుచో చెడును.

అభక్ష్యములు

లశునం గుంజనం చైవ పలాండుం కవికాని చ
అభక్ష్యాణి ద్విజాతీనా మమేధ్య ప్రభవాని చ. (5-5)

వెల్లుల్లి, నీరుల్లి, చిన్నఉల్లి, కుక్కగొడుగులు, అమేధ్యములో పెరిగిన కూరలు వీనిని తినకూడదు; ముఖ్యముగా బ్రాహ్మణులు తినకూడదు.

లోహితాన్ వృక్షనిర్యాసాన్ వృశ్చనప్రభవాం స్తథా
సేలుం గవ్యం చ పేయూషం ప్రయత్నేన వివర్జయేత్. (5-6)

చెట్లయొక్క ఎఱ్ఱనిజిగురును, చెట్లకు నాటుపెట్టగా వచ్చిన ఏ రంగు జిగురునైనను తినకూడదు. అడవిమెంతి, అవుజున్ను కూడ అభక్ష్యములు.

సముత్పత్తిం చ మాంసస్య వధబంధౌ చ దేహినామ్
ప్రసమీక్ష్య నివర్తేత సర్వమాంసస్య భక్షణాత్. (5-49)

ప్రాణిహింసవలననేకాని మాంసమురాదని తెలిసికొని ప్రాణులకు వధ బంధములను గల్గించుట యెంతపాపమో గ్రహించి మానవుడు సర్వ మాంసములను పరిత్యజింపవలెను.

అనిర్దశాయా గోఃక్షీర మౌష్ట్రమైక శఫం తథా
ఆవికం సంధినీక్షీరం వివత్సాయాశ్చ గోః పయః (5-8)

ఈనిన పదిదినములలోపున గోవుయొక్కయు, ఒంటెయొక్కయు గొఱ్ఱె యొక్కయు పాలను త్రాగరాదు. ఎదవోయిన పశువుయొక్కయు, దూడ చనిపోయిన గోవుయొక్క పాలనుకూడ త్రాగరాదు.

అరణ్యానాం చ సర్వేషాం మృగాణాం మాహిషం వినా
స్త్రీక్షీరం చైవ వర్జ్యాని సర్వశుక్తాని చై వహి. (5-9)

పులుపెక్కునంతకాలము ఆగి ఆరణ్యకపశువుపాలను త్రాగరాదు. మానుషీక్షీరమునకు కూడ ఈ నిషేధము వర్తించును. గేదె పాలకు వర్తించదు.

సంవత్సరస్యైకమపి చ రేత్కృచ్ఛ్రం ద్విజోత్తమః
అజ్ఞాతభుక్త శుద్ధ్యర్థం జ్ఞాతస్య తు విశేషతః. (5-21)

తెలియకుండగనే తినకూడని వస్తువులను తినుట సంభవించవచ్చును. కావున బ్రాహ్మణుడు సంవత్సరమున కొకసారి కృచ్ఛ్ర ప్రాజాపత్యవ్రతమును చేసికొనవలయును. తెలియబడిన అన్న దోషమునకు శాస్త్రోక్త ప్రాయశ్చిత్తములను చేసికొనవలయును.

అభోజ్యమన్నం నాత్తవ్యమాత్మనః శుద్ధిమిచ్ఛతా
అజ్ఞానభుక్తం తూత్తార్యం శోధ్యం వా ప్యాశుశోధనైః. (11-160)

పరిశుద్ధిని కోరువాడు అభోజ్యాన్నమును తినరాదు. ఒకవేళ తెలియక తిన్నచో వమనము చేసికొనవలయును. అది సాధ్యముకానిచో వెంటనే

ప్రాయశ్చిత్తము చేసికొనవలయును. చండాలదృష్టాన్నమును, అవరవర్ణస్పృష్టాన్నము కూడ అభోజ్యములని మనువు చెప్పినాడు.(3-239)

పంక్తిబాహ్యత

అపాంక్తదానేయో దాతుర్భవ త్యూర్ధ్వఫలోదయః
దైవే హవిషిపిత్ర్యేవా తత్ప్రవక్ష్యా మ్య శేషతః. (3-169)

సత్పురుషులతోకలసి పంక్తిలో భోజనముచేయుటకు అర్హతలేని వారు కొందరు కలరు. వారు సాధారణ సమయములలోనే సహపంక్తి భోజనమున కనర్హులు. అట్టివారికి దైవపిత్ర్య కర్మలలో భోజనము పెట్టుట మరింత నిషిద్ధము (3-70) అన్నకు వివాహముకాకుండ తాను వివాహము చేసికొన్నవాడు, మద్యపానాదులు చేసినవాడు, కుష్ఠురోగి, అతికోపస్వభావము కలవాడు, శత్రువు, వేటగాడు మున్నగువారు అపాంక్తేయులు.

పంక్తిపావనులు

అగ్ర్యాస్సర్వేషు వేదేషు సర్వప్రవచనేషు చ
శ్రోత్రియాన్వయ జాశ్చైవ విజ్ఞేయాః పంక్తిపావనాః. (3-184)

బ్రాహ్మణుల భోజనపంక్తిలో అపాంక్తేయులు తెలియబడకుండగానే యుందురేమో యను శంకతో పంక్తిపావనులను కూర్చుండబెట్టుట మంచిది. పంక్తిని పవిత్రముచేయగల వారెవరనగా చతుర్వేదములలోను, తదర్థ ప్రవచనములోను శ్రేష్ఠులు, శ్రోత్రియవంశములో పుట్టినవారు, త్రిణాచికేతమను వేదభాగమును చక్కగా అధ్యయనము చేసినవారు, అగ్నిహోత్రి, త్రిసువర్ణపాతకుడు, షడంగవేత్త, బ్రాహ్మవివాహమువలన జన్మించినవాడు, నూరేండ్లవయస్సుగలవాడు, సహస్రగోదానము చేసినవాడు. ఇట చెప్పబడిన లక్షణములు వేదాధ్యయనసంపత్తితో కూడుకొన్నప్పుడు మాత్రమే పంక్తి పావనత్వమును కల్గించును.

స్పృశింపరాని అవయవములు

ఊర్ధ్వం నాభేర్యానిఖాని తాని మేధ్యాని సర్వశః
యాన్యధస్తాన్య మేధ్యాని దేహాచ్చైవ మలాశ్చ్యుతాః (5-132)

అనాతురః స్వాని ఖాని న స్పృశేద నిమిత్తతః
రోమాణి చ రహస్యాని సర్వాణ్యేవ వివర్జయేత్. (4-144)

నాభికి పైనున్న అవయవములన్నియు పవిత్రములు. కావున వానిని స్పృశించినను అపరిశుద్ధి కలుగదు. నాభికి క్రింది భాగములు అపరిశుద్ధములు. వానిని స్పృశించుచో అపరిశుద్ధి కలుగును. దేహమునుండి వచ్చు మలము లన్నియు అపరిశుద్ధములు.

ఆరోగ్యముగానున్నవాడు కేశములను, నేత్ర శ్రోత్రాదీంద్రియములను అకారణముగా స్పృశింపరాదు.

సంధ్యానిద్ర కూడదు

సూర్యేణ హ్యభినిర్ముక్తః శయానో భ్యుదితశ్చయః
ప్రాయశ్చిత్తమ కుర్వాణో యుక్తః స్యాన్మహతైనసా. (2-221)

సూర్యోదయ సూర్యాస్తమయములందు నిద్రపోవువాడు మహాపాపము పొందును. అట్టివాడు ప్రాయశ్చిత్తము చేసికొనవలయును.

శుద్ధికరములు

సర్వేషామేవ శౌచనా మర్థశౌచం పరం స్మృతమ్
యో ఽర్థేశుచిర్హి స శుచిర్న మృద్వారి శుచిశ్శుచిః. (5-106)

అన్నివిధములైన శౌచముకంటె అర్థశౌచము గొప్పది. (అనగా అన్యాయ మార్గముచేత ధనము సంపాదింపకుండుట సర్వోత్తమమైన శౌచమును కల్గించును) ధనవిషయములో శుచియైనవాడే నిజముగా శుచియైనవాడు.

మన్ను, నీరు మున్నగు వానితో తోముకొనుటవలన కల్గిన పరిశుద్ధి యంత గొప్పదికాదు.

అద్భిర్గాత్రాణి శుద్ధ్యన్తి మనః సత్యేన శుద్ధ్యతి
విద్యాతపోభ్యాం భూతాత్మా బుద్ధిర్జ్ఞానేన శుద్ధ్యతి. (5-109)

మాలిన్యముపొందిన శరీరము నీటిచే పరిశుద్ధమగును. మురికి సంపర్కముగలనది వేగముగా ప్రవహించుటవలన శుద్ధమగును. మనస్సు సత్యముచేత శుద్ధమగును. జీవాత్మ బ్రహ్మవిద్యచేతను, తపస్సుచేతను శుద్ధి పొందును. బుద్ధి జ్ఞానముచేత శుద్ధమగును.

జ్ఞానం తపోఽగ్నిరాహారో మృన్మనో వార్యుపాంజనమ్
వాయుః కర్మార్కకాలౌ చ శుద్ధేః కర్మాణి దేహినామ్.(5-105)

బ్రహ్మజ్ఞానము అంతఃకరణమునకు శుద్ధిని గల్గించును. తపస్సు వేదవిదులుమున్నగువారికి శుద్ధిని కల్గించును. అగ్ని మైలపడినకుండలు మున్నగువానికి శుద్ధిని కల్గించును. దేవతలకు అర్పింపగా మిగిలిన హవిస్సు భక్షించువారికి శుద్ధిని కలిగించును. మంచిమనస్సు వాక్కునకు పవిత్రత కల్గించును. నీరు బహువస్తువులకు శుద్ధిని కల్గించును. అలుకుట నేలకు శుద్ధిని గల్గించును. అపవిత్రులైపోయినవారికి కొన్ని కర్మానుష్ఠానములు శుద్ధిని కల్గించును. కాలము గడచుటకూడ కొన్నిటికి శుద్ధిని కల్గించును. కాలము, కొన్నివిధములైన వాయువులు వీచుటకూడ శుద్ధిని గల్గించును. కొన్ని సందర్భములలో సూర్యసందర్శనము శుద్ధిని కల్గించును.

క్షాంత్యాశుద్ధ్యంతి విద్వాంసో దానేనా కార్యకారిణః
ప్రచ్ఛన్నపాపా జప్యేన తపసా వేదవిత్తమాః. (5-107)

విద్వాంసులు ఓర్పుచేత పరిశుద్ధులగుదురు. కూడనిపనులు చేయువారు దానమువలన కొంతవరకు శుద్ధిని పొందుదురు, అట్లే రహస్యపాపములు చేసినవారు మంత్రజపములవలన శుద్దిని పొందుదురు.

నిర్లేపం కాంచనం భాండ మద్భిరేవ విశుద్ధ్యతి
అబ్జమశ్మమయం చైవ రాజతం చా నుపస్కృతమ్. (5-112)

ఉచ్ఛిష్ట మంటుకొనకున్నచో బంగారము, శంఖము, రాళ్లు, వెండి వీనికి సంబంధించిన వస్తువులు నీటితో కడుగుటవలననే శుద్ధిని పొందును ఉచ్ఛిష్టమంటుకొన్నను, మసిపట్టినను వెండి, బంగారములు నీటితోను నిప్పుతోను శుద్ధిపొందును.

ద్రవాణాం చైవ సర్వేషాం శుద్ధిరుత్పవనం స్మృతమ్
ప్రోక్షణం సంహతానాం చ దారవాణాం చ తక్షణమ్.(5-115)

కాకి , కోడి మున్నగువానిచే స్పృశింపబడిన ఘృతాదితైలములకు కుశలతో ఉత్పవనము చేయుటవలన శుద్ధి కలుగును. శయ్య మున్నగువానికి శుద్ధి కలుగవలెనన్నచో నీటిని చల్లవలయును. కఱ్ఱతో చేయబడిన వానికి ఎక్కువ మాలిన్యమంటుకొన్నచో పై భాగమును చెక్కివేయుట వలన శుద్ధి కలుగును. (వస్త్రములను నీటితో తడుపుటవలన శుద్ధి కలుగునని స్థలాంతరమున చెప్పబడినది.)

విణ్మూత్రోత్సర్గ శుద్ధ్యర్థం మృద్వార్యాదేయ మర్థవత్
దైహికానాం మలానాం చ శుద్ధిషు ద్వాదశస్వపి. (5-134)

మలమూత్రములను విడిచిన పిమ్మట ఆ అవయవములను మట్టితోను, నీటితోను శుద్ధిచేయవలయును. (దేహమునుండి బయటకు వచ్చు చెమట మున్నగు మిగిలిన పదిమలములలోను రక్తము మున్నగువానికి మృద్వారుల రెండింటితోను, శ్లేష్మము మున్నగువానికి కేవలము నీటితోను శుద్ధి కలుగును.)

కృత్వా మూత్రం పురీషం వా ఖాన్యా చాంత ఉపస్పృశేత్
వేదమధ్యేష్యమాణ శ్చ అన్నమశ్నం శ్చ సర్వదా. (5-138)

మలమూత్రముల యనంతరము పైని చెప్పబడినట్లు శౌచమును చేసికొని ఆచమనము చేసి నేత్రములను, శ్రోత్రములను, నాసికారంధ్రములను

స్పృశింపవలయును. వేదాధ్యయనము చేయుటకును, భోజనమునకును పూర్వము కూడ ఇట్లే చేయవలెను.

నిద్రనుండి లేచిన పిమ్మట, తుమ్మిన పిమ్మట, భోజనమునకు పిమ్మట, నిష్ఠీవనమునకు పిమ్మట, నీరు త్రాగిన పిమ్మట ఆచమనము చేయవలయును.

స్నానము

న స్నాన మాచరేద్భుక్త్వా నాతురో న మహానిశి
న వాసోభిః సహాజస్రం నావిజ్ఞాతే జలాశయే. (4-129)

భోజనముచేసిన పిమ్మట స్నానము చేయకూడదు. రోగియై స్నాన మాచరించకూడదు; అర్ధరాత్రియందు స్నానము చేయకూడదు. హెచ్చుగా వస్త్రములు వేసికొని స్నానము చేయరాదు. పరిచితముకాని చెరువులో స్నానము చేయకూడదు.

నదీషు దేవఖాతేషు తటాకేషు సరస్సు చ
స్నానం సమాచరేన్నిత్యం గర్తప్రస్రవణేషు చ. (4-203)

నదులయందును, దేవతలచే నిర్మింపబడిన తటాకములందును, సరస్సులయందును, ఇతర జలాశయములయందును స్నానము చేయవలయును.

ఒట్టు పెట్టుకొనకూడదు

న వృథాశపథం కుర్యాత్ స్వల్పేఽప్యర్థే నరో బుధః
వృథా హి శపథం కుర్వన్ ప్రేత్యచేహ చ నశ్యతి. (8-111)

వ్యర్థముగా ఒట్టు పెట్టుకొనకూడదు; చిన్నవిషయములకు గూడ ఒట్టు పెట్టుకొనగూడదు. అట్లు పెట్టుకొన్నచో ఇహపరలోకములలో హాని గల్గును.

మాంగల్యకరములు

మంగళాచార యుక్తానాం నిత్యం చ ప్రయతాత్మనామ్
జపతాం జుహ్వతాం చైవ వినిపాతో న విద్యతే. (4-146)

అభీష్టకార్యసిద్ధి కొఱకు గోరోచనాది ధారణము గావించుట, గురుసేవాది సదాచారములను గల్గియుండుట, ఇంద్రియ నిగ్రహమును, బాహ్యాభ్యంతర శౌచమును గల్గియుండుట, గాయత్ర్యాది జపము గావించుట, శాస్త్రీయమైన హోమము నాచరించుట - ఈ ధర్మములందుండు వారికి ఎన్నటికిని పతనము కలుగదు.

జీవితములో ఆశాభంగములు కలిగినను, దారిద్ర్యాదు లనుభవింపవలసి వచ్చినను "ఇక నా బ్రతుకు ఇంతియే" యని మానవుడు నిరుత్సాహపడి తన్ను తానవమానించుకొనరాదు. యావజ్జీవము శుభమును గోరుచు అది తమకు దుర్లభము కాదను భావముతో నుండవలయును.

నాత్మాన మవమన్యేత పూర్వాభిరసమృద్ధిభిః
అమృత్యోః శ్రియమన్విచ్ఛన్ నైనాం మన్యేత దుర్లభమ్.
(4-137)

పూర్వాహ్ణ కర్తవ్యములు

మైత్రం ప్రసాధనం స్నానం దంతధావన మంజనమ్
పూర్వాహ్ణ ఏవ కుర్వీత దేవతానాం చ పూజనమ్. (4-152)

స్నానము, మలోత్సర్జనము, అలంకారము, దంతధావనము, కాటుక పెట్టుకొనుట, దేవతాపూజనము - వీటిని ప్రొద్దుటిపూటనే చేయవలయును. (మధ్యాహ్నమునకు పూర్వముననే చేయవలయును.)

ఇట్టి సదాచారము లెన్నియో మనుస్మృతిలోను, ఇతర స్మృతులలోను కన్పట్టుచున్నవి; వీనిని పాటించుటచే శుభ ప్రాప్తి, అశుభనివారణము కలుగును, ఆచారములకుకాని, అనాచారములకుకాని చెప్పబడిన శుభాశుభఫలములు సమగ్రములని తలంపరాదు. చెప్పబడని ఫలములుకూడ నుండును. కొన్నిపట్ల శుభాశుభఫలములు నిర్దేశింపబడవు కూడ. సదాచారములకు రజస్తమో గుణములను తగ్గించి సత్త్వగుణమును వృద్దినొందించు స్వభావము కలదు. అట్లే దురాచారములకు సత్త్వగుణమును తగ్గించి రజస్తమో గుణములను

పెంచు స్వభావము కలదు. ఎంత అప్రధానులుగా పైకి కన్పట్టువానికైనను ఈ లక్షణము కలదు. వెనువెంటనే గాని, చిరకాలమునకు కాని సుఖదుఃఖ రూపఫలము వీనికి గలుగును. దృశ్యఫలమే ఫలమని తలంపరాదు. మరియు దృశ్యఫలములుకూడ అన్నియు మనకు దృష్టములగుటలేదు. గ్రహణ సమయములలో సూర్యుని చూడరాదని మనువు నిషేధించినాడు. (4-37) గ్రహణసమయములలో సూర్యుని చూచుటవలన అంధత్వము రావచ్చునని ఆధునిక విజ్ఞాననిష్ణాతులు చెప్పుచున్నారు. వీరీ సంగతిని కనిపెట్టక పూర్వము మనువచనము అప్రమాణమును, కనిపెట్టిన తర్వాత ప్రమాణమును కాదు. మనము ఫలమును కనిపెట్టగల్గుటతోను, కని పెట్టజాలక పోవుటతోను నిమిత్తము లేకుండ స్మృతివచన మెప్పుడును శ్రేయస్సాధకమే యగును.

రాత్రులందు చెట్లక్రింద నుండరాదనియు, దూరముగా నుండవలయు ననియు మనుస్మృతి చెప్పుచున్నది (4-37) ఈ విషయములో ఆధునికవిజ్ఞాన మిట్లు చెప్పుచున్నది. పగటిపూట చెట్లు బొగ్గుపులుసు గాలిని పీల్చి ప్రాణవాయువును విడచును. కావున చెట్టువద్దనుండు మానవునినుండి బయటకువచ్చు బొగ్గుపులుసుగాలి హరించిపోవుటయేకాక వానికి పుష్కలముగా ప్రాణవాయువు లభించును. రాత్రులందు వృక్షములు ప్రాణవాయువునే పీల్చుకొనుచు, బొగ్గుపులుసు గాలిని బయటకు విడుచును కావున చెట్టువద్దనుండుట పగటిపూట లాభకరము; రాత్రిపూట హానికరము. ఇట్లు మనువచనమును సైన్సు సమర్థించుచున్నను, ఈ సమర్థముమీదనే మనువచన ప్రామాణ్య మాధారపడియున్నదని తలంపరాదు. సైన్సు ఈ సంగతిని కనిపెట్టుటకు పూర్వముననను మనువచనము శిరోధార్యమే; నేడును శిరోధార్యమే. అట్లే మనువు చెప్పిన సమస్త ధర్మములు మనము వాని ఔచిత్యానౌచిత్యములను తెలిసికొనగల్గినను, తెలిసికొనజాలకపోయినను ప్రమాణములే యగును.



4. ఆధ్యాత్మిక సాధనలు

మనువు ప్రదర్శించిన కల్యాణమార్గము ఐహికాముష్మిక సుఖప్రాపకము మాత్రమే కాక ఆత్మవికాస హేతువుకూడనని గుర్తింపదగును. అంతః కరణమును నిర్మలము గావించుకొనుటకును, మోక్షార్హతను చేకూర్చుకొనుటకును మానవుడవలంబింపవలసిన సాధనముల ననేకములను మనువు నిర్దేశించినాడు. మచ్చునకు కొన్నింటిని సమీక్షింతము.

ఇంద్రియ నిగ్రహము

ఇంద్రియాణాం ప్రసంగేన దోషమృచ్ఛ త్యసంశయమ్

సన్నియమ్య తు తాన్యేవ తతః సిద్ధిం నియచ్ఛతి. (2-93)

త్వగింద్రియమును స్పర్శమీదకును, నేత్రేంద్రియమును రూపము మీదకును, జిహ్వేంద్రియమును రుచిమీదకును, ఘ్రాణేంద్రియమును వాసనమీదకును, శ్రోత్రేంద్రియమును శబ్దముమీదకును, ఆసక్తితో ప్రసరింపజేయుట వలనను, మనస్సును చపలముగ నుంచుకొనుట వలనను మానవుడు తప్పక దోషమును పొందును. వానిని నిగ్రహించుకొనుచో ఉత్తమపురుషార్థసిద్ధిని మోక్షమును గూడ పొందగల్గును.

న జాతు కామః కామానా ముపభోగేన శామ్యతి

హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే. (2-94)

భోగముల ననుభవించుటవలన కోరిక చల్లారదు; పైగా వృద్ధి పొందుచునే యుండును. అగ్నిహోత్రములో హవిస్సును వేయుటవలన అగ్ని ఆరిపోవుటకు బదులుగా వృద్ధియే చెందునుగదా!

యశ్చైతాన్ ప్రాప్నుయాత్సర్వాన్ యశ్చైతాన్కేవలాం స్త్యజేత్

ప్రాపణాత్సర్వ కామానాం పరిత్యాగో విశిష్యతే. (2-95)

ఒకడు కోరిన భోగములనన్నిటిని పొందవచ్చును; మరొకడు అన్ని భోగములపట్లను ఉపేక్షాభావముతో నుండవచ్చును. ఆ పొందిన వానికంటె

ఈ యుపేక్షాభావము గలవాడు గొప్పవాడు. భోగములను పొందుటకంటె వాని నుపేక్షించుట యెక్కువ. ఏలయన భోగములను పొందినవాడు వానిని అనుభవించు సాధనములను సంపాదించుకొనుటలో క్లేశపడవలసియుండును. మరియు ఆ భోగములు ముగిసిపోవునపుడు దుఃఖమును పొందును. భోగముల నుపేక్షించువానికి ఈ బాధ లేదు. వాడెల్లప్పుడును ప్రశాంతముగానే యుండును.

న తథైతాని శక్నోతి సన్నియన్తు మసేవయా
విషయేషు ప్రజుష్టాని యథా జ్ఞానేన నిత్యశః. (2-96)

విషయానుభవములో నున్న ఇంద్రియములను నిగ్రహించుటకు రెండు మార్గములు కలవు.

1. ఇంద్రియములను విషయములచెంతకు పోనీయకుండుట, 2. విషయ భోగములు క్షణికములనియు, శరీరము అస్థి రక్త మజ్జాదిమయమనియు నిరంతరము భావించుచుండుట. ఈ రెండవ దానివలన నిగ్రహింపబడినంతగ నింద్రియములు మొదటిదానివలన నిగ్రహింపబడవు. ఏలయన, విషయములు దగ్గరలేకపోయినను మనస్సు వానికై పరితపించుట సంభవించును, జ్ఞానమువలన విషయములపట్ల మనస్సులో కూడ ఉపేక్షాభావమేర్పడును.

వేదాస్త్యాగశ్చ యజ్ఞాశ్చ నియమాశ్చతపాంసిచ
న విప్రదుష్టభావస్య సిద్ధిం గచ్ఛంతి కర్హిచిత్. (2-97)

వేదములు, త్యాగము, యజ్ఞములు, నియమములు, తపస్సులు - ఇవి భోగాభిలాషచే దూషితమైన మనస్సుగలవానికి ఫలింపవు.

శ్రుత్వా స్పృష్ట్వాచ దృష్ట్వాచ భుక్త్వా ఘ్రాత్వాచ యో నరః
న హృష్యతి గ్లాయతి వా సవిజ్ఞేయో జితేంద్రియః. (2-98)

శబ్దములను వినుచును, వస్తువులను స్పృశించుచును, రూపములను చూచుచును, రుచుల నాస్వాదించుచును, వాసనల నాఘ్రాణించుచును గూడ ఏ మానవుడు సంతోషింపడో, బాధపడడో వాడు జితేంద్రియుడుగా తెలియదగినవాడు

ఇంద్రియాణాం తు సర్వేషాం యద్యేకం క్షరతీంద్రియమ్
తేనాస్య క్షరతి ప్రజ్ఞాధృతేః పాదాదివోదకమ్. (2-99)

త్వక్చక్షుర్జిహ్వాఘ్రాణ శ్రోత్రేంద్రియములలో నే యొక్కయింద్రియము విషయముమీదికి ప్రసరించినను మానవుని ప్రజ్ఞ జారిపోవును. నీళ్ళుగల తిత్తికి చిల్లులుపడుచో ఆ చిల్లులున్న చోటునగల నీరేకాక తిత్తిలోని నీరంతయు కారిపోవును. అట్లే ఒక యింద్రియమునుండి ప్రజ్ఞ జారుచో మానవుడు తత్త్వజ్ఞాన రహితుడగును.

వశే కృత్వేంద్రియగ్రామం సంయమ్య చ మనస్తథా
సర్వాన్ సంపాదయే దర్థానక్షిణ్వన్ యోగతస్తనుమ్. (2-100)

ఇంద్రియములను స్వాధీనము చేసికొని మనస్సును కూడ నిగ్రహించుకొను వాడును, ఉపాయముచేత శరీరమును పీడించుకొననివాడును సర్వపురుషార్థములను సాధించుకొనవచ్చును.

కావున మానవుడు మనస్సును, వాక్కును, శరీరమును విచ్చలవిడిగా పోనీయరాదు. వానిని అణచిపెట్టి ధర్మమార్గములో నడుపుకొనవలయును. ఎవడిట్లు మనోదండమును, వాగ్దండమును. కాయదండమును గలిగి వానిని శిక్షించుకొనునో వాడు త్రిదండియని చెప్పబడును. అతడు కామక్రోధములను జయించి మోక్షార్హతను పొందును.

వాగ్దండోఽథ మనోదండః కాయదండ స్తథైవ చ
యస్యైతే నిహితా బుద్ధౌ త్రిదండీతి స ఉచ్యతే. (12-10)

వేదాభ్యాస స్తపోజ్ఞాన మింద్రియాణాం చ సంయమః
అహింసా గురుసేవాచ నిఃశ్రేయసకరం పరమ్. (12-83)

వేదాభ్యాసము, తపస్సు, జ్ఞానము, ఇంద్రియనిగ్రహము, అహింస గురుసేవ- ఇవి మోక్షము నొసంగును.

సర్వేషా మపి చైతేషా మాత్మజ్ఞానం పరం స్మృతమ్
తద్ధ్యగ్రం సర్వవిద్యానాం ప్రాప్యతే హ్యమృతం తతః.(12-89)

ఈ యన్నింటిలోను ఆత్మజ్ఞానము గొప్పది. దానివలన అమృతత్త్వము లభించును. అది సర్వవిద్యలలోను శ్రేష్ఠము.

నిత్యనైమిత్తిక కర్మలు

బ్రాహ్మముహూర్తమందు నిద్రనుండి లేవగానే ధర్మార్థములను గురించి యాలోచింపవలయును. (అనగా ధర్మమునకు విరుద్ధముకాని విధమున అర్థార్జనమును గావించుట యెట్లో ధనముచే ధర్మము నెట్లాచరించవలయునో ఆలోచింపవలయును.) మరియు ఏపని చేయుటవలన నెంతఅర్థము లభించునో యెంతధర్మము సంపాదించినట్లగునో బాగుగా నాలోచించుకొని ధర్మార్థములకు సహాయపడని శరీరక్లేశకరములయిన పనులను విడుచుటకును ధర్మార్థముల యభివృద్ధికి సాయపడుపనులను గావించుకొనుటకును నిశ్చయించు కొనవలయును. మరియు నా సమయమున వేదతత్త్వార్థము నాలోచింప వలయును. (వేదము కర్మబ్రహ్మోభయాత్మకము కావున పరమాత్మ తత్త్వమును గురించియు, ధర్మతత్త్వమును గురించియు నాలోచింపవలయును.)

బ్రాహ్మేముహూర్తే బుద్ధ్యేత ధర్మార్థౌ చానుచిన్తయేత్
కాయక్లేశాం శ్చ తన్మూలాన్ వేదతత్త్వార్థ మేవ చ. (4-92)

ఇట్లు ఆత్మతత్త్వమును గురించియు, ధర్మమును గురించియు కొంత చింతించిన పిమ్మటనే నిత్యకర్మానుష్ఠానము లోనికిని, పిమ్మట సమస్త వ్యవహారములలోనికిని దిగవలయుననుటచే ఆత్మసాధన లక్ష్యమనపాయిగా హృదయములో నుండవలయునని స్పష్టమగుచున్నది.

జ్ఞానవైరాగ్యములకు ప్రతిబంధకమైన అంతఃకరణమాలిన్యమును క్షాళనము చేయుశక్తి నిత్యకర్మానుష్ఠానమునకు గలదు. స్నానము, సంధ్య, జపము, హోమము, బ్రహ్మయజ్ఞము, దేవపూజ, ఆతిథ్యము వైశ్వదేవము అనునవి నిత్యకర్మలు.

తలిదండ్రులనుండి జన్మతోనే సంక్రమించు బీజసంబంధమైనట్టియు గర్భసంబంధమైనట్టియు పాపము, గర్భాధాన, పుంసవన, సీమంతోన్నయన,

జాతకర్మ, నామకరణాన్నప్రాశనోపనయన, వేదవ్రత, గోదాన, స్నాతక, వివాహములనెడు సంస్కారముచేత పోగొట్టుకొనదగినది.

గార్భైర్హోమై ర్జాతకర్మ చౌడమౌంజీ నిబంధనైః
బైజికం గార్భికం చైనో ద్విజానా మపమృజ్యతే. (2-27)

వేదాధ్యయనముచేతను, వ్రతములచేతను, హోమములచేతను, త్రైవిద్యాఖ్యవ్రతముచేతను, బ్రహ్మచర్యములో దేవర్షి పితృతర్పణాత్మకమైన యజ్ఞముచేతను. గృహస్థాశ్రమములో పుత్రోత్పాదనముచేతను, పంచమహా యజ్ఞములచేతను, జ్యోతిష్టోమాది క్రతువులచేతను ఈ శరీరము (అందలి యాత్మ) బ్రహ్మప్రాప్తికి అర్హతకలది యగుచున్నది.

ఏకాదశ్యాదితిథుల గ్రహణాదిసమయములలోను ఆచరింపదగిన కర్మలును, పితృకర్మలును నైమిత్తికములే యైనను అవశ్యాచరణీయములుగా చెప్పబడినవి. దైవకార్య పితృకార్యములకు సంఘర్షణమువచ్చినపుడు ద్విజులు పితృకార్యమునకే అగ్రస్థానము నీయవలయునని మనువు చెప్పుచున్నాడు.

దేవకార్యా ద్ద్విజాతినాం పితృకార్యం విశిష్యతే. (3-203)

శ్రేయస్కారములైనవారు నిత్యనైమిత్తిక కర్మలను శ్రద్ధతో నాచరించుచో ప్రత్యవాయ నివారణమేకాక పాపక్షయముకూడ కల్గును.

ఈ గ్రంథములో ఆచార ప్రకరణములో తెలుపబడిన ఆహారశుద్ధిమున్నగు నంశములుకూడ అంతఃకరణశుద్ధిని కల్గించుటద్వారా ఆధ్యాత్మిక వికాసమునకు తోడ్పడకలవు. అట్లే సమాజవ్యవస్థాప్రకరణములో తెలుపబడిన గురుసేవాది ధర్మములు చిత్తమున కుత్తేజము కల్గించును.

తమ తమ వర్ణములకును, ఆశ్రమములకును విహితములైన కర్మలను నిష్కామముగా ఆచరించువారు పరమపదమును పొందుట కర్హులగుదురు. (వర్ణాశ్రమధర్మములనుగూర్చి కొంతవిపులవిచారమును నా "హిందూమతము"లో గావించినాను. కావున నిట నా ప్రసంగమును విడచినాను.

సత్యము

అసత్యము ఆత్మద్రోహము. సత్యప్రాముఖ్యమును తెల్పే ఈ క్రింది శ్లోకములో ఆత్మన్ శబ్దప్రయోగము గమనింప దగినది.

యో౽న్యథా సంత మాత్మాన మన్యథా సత్సుభాషతే
స పాపకృత్తమో లోకేస్తేన ఆత్మాపహారకః. (4-255)

అసత్యమాడువాడు తనమన స్సేరీతిగానున్నదో యా రీతిగాకాక మరొకరీతిగా తన యాత్మను పైకి రానిచ్చుచున్నాడు. అసత్యముచే నితరులను మోసగించితినని వాడు తలచుచున్నాడు. కాని యథార్థముగా తన యాత్మను తానే అపహరించుచున్నాడు. కనుక వాడు పాపులలో నెల్లపాపాత్ముడు.

వాచ్యర్థా నిహితా స్సర్వే వాఙ్మూలా వాగ్వినిస్సృతాః
తాంస్తు యస్తేన యే ద్వాచం స సర్వస్త్యే య కృన్నరః.(4-256)

అన్ని వస్తువులును శబ్దములయందే యున్నవి; శబ్దములే మూలముగా కలవి; శబ్దములనుండియే వెల్లడి యగుచున్నవి. అట్టి వాక్కునెవడు అపహరించునో (అసత్యముగా పల్కునో) వాడు అన్నివిధములైన దొంగతనమును చేసినవాడగును.

ధనశుద్ధి

అన్నశుద్ధి కేవలము బాహ్యశౌచముమీదనే యాధారపడియుండదు. అన్నమే కాదు; మన మనుభవించు సమస్తవస్తువులును దోషరహితములుగా నుండవలయునన్నచో నవి న్యాయమార్గములో సంపాదింపబడియుండ వలయును. అన్యాయముగా సంపాదింపబడిన ధనముతో అనుభవింపదు. అన్నాదులు అంతఃకరణమునకు మాలిన్యమును గల్గించును. పాపము పోవుటకై ఎవరైనను దానముచేయగా వచ్చిన ధనమునకుకూడ నీ పాపము అంటుకొనియుండును. అట్టి అన్యాయధనమును దరికి రానీయరాదు. ఒక వేళ తెలియక రానిచ్చుచో తెలియగానే విడిచిపెట్టవలయును. కొంత

అనుభవింపబడిన తర్వాత తెలిసినచో జపముచేతను తపస్సుచేతను అంతః కరణశుద్ధి గావించుకొనవలయును.

యద్గర్హితే నార్చయంతి కర్మణా బ్రాహ్మణా ధనమ్
తస్యోత్సర్గేణ శుద్ధ్యన్తి జప్యేన తపసైవ చ. (11-193)

దానము చేయబడినను పాపాత్ముని ధనమును గ్రహింపరాదు. దాతయొక్క పాపములు దత్తద్రవ్యముద్వారా ప్రతిగ్రహీతకు సంక్రమించును. రాజైనను సరియే లుబ్ధుడును, పాపియునైనచో అతని ధనమును గ్రహింపరాదు.

యో రాజ్ఞః ప్రతిగృహ్ణాతి లుబ్ధస్యో చ్ఛాస్త్రవర్తినః
స పర్యాయేణ యాతీమాన్ నరకానేక వింశతిమ్. (4-87)

సాధారణముగాకూడ ప్రతిగ్రహము పాపజనకము. విద్యాతపస్సుల చేతనే యా పాపము పోగలదు. విద్యాతపస్సులు లేనివాడు ప్రతి గ్రహము చేయుచో రాతిపడవ నెక్కినవానివలె మునిగిపోవును.

అతపాస్త్వన ధీయానః ప్రతిగ్రహరుచి ర్ద్విజః
అంభస్యశ్మప్లవే నేవ తేనైవసహ మజ్జతి. (4-190)

బ్రాహ్మణునకు ప్రతిగ్రహాధికారమున్నను విద్యాతపస్సులులేనిచో ప్రతి గ్రహము పాపజనకమగును. విద్యాతపస్సులున్నవాడుకూడ ప్రతి గ్రహమువలన తేజస్సును కోల్పోవును.

ప్రతిగ్రహసమర్థోపి ప్రసంగం తత్ర వర్జయేత్
ప్రతి గ్రహేణ హ్యస్యాశు బ్రాహ్మంతేజః ప్రణశ్యతి. (4-186)

కావున సమర్థుడైనవాడుకూడ ప్రతిగ్రహము చేయకుండట మేలు.

హృదయ మార్దవము

మైత్రనిస్వభావమును ఇంద్రియనిగ్రహమును దాతృత్వమును గల్గి, దృఢవ్రతుడయి క్రూరులతో స్నేహముచేయక ఎవరికిని హింసగావింపక యుండు మానవుడు స్వర్గమును జయించును.

దృఢకారీ మృదుర్దాంతః క్రూరాచారైర సంవసన్
అహింసో ద్రమ దానాభ్యాం జయేత్స్వర్గం తథా వ్రతః(4-246)

పరలోకము లేదనుబుద్ధిని, వేదనిందను, దేవతాదూషణమును, ద్వేషమును, దంభమును, దురభిమానమును, కోపమును, క్రూరత్వమును విడిచిపెట్టవలయును.

నాస్తిక్యం వేదనిందాం చ దేవతానాం చ కుత్సనమ్
ద్వేషం దంభం చ మానం చ క్రోధం తైక్ష్ణ్యం చ వర్జయేత్.(4-163)

వేదాభ్యాసము

వేద మేవాభ్యసే న్నిత్యం యథాకాల మతంద్రితః
తం హ్యస్యాహుః పరం ధర్మముపధర్మో உన్య ఉచ్యతే. (4-147)

బ్రాహ్మణుడు నిత్యము వేదాభ్యాసము చేయుచుండవలయును. ముఖ్యముగా అవసరమునకు తగినట్లు శ్రేయోహేతుకములయిన మంత్రములను జపించుచుండవలయును. ఇదియే బ్రాహ్మణునకు సర్వోత్కృష్టమైన ధర్మము. మిగిలిన ధర్మమంతయు దీనికి లోబడినదే.

వేదా భ్యాసేవ సతతం శౌచేన తపసైవ చ
అద్రోహేణ చ భూతానాం జాతిం స్మరతి పౌర్వికీమ్. (4-148)

బ్రాహ్మణుడు వేదాభ్యాసము చేయుటచేతను, శుచిగా నుండుట చేతను, తపస్సు చేయుటచేతను, ఏ ప్రాణికిని ద్రోహము చేయకుండుట చేతను పూర్వజన్మజ్ఞానమును పొందగల్గును.

పౌర్వికీం సంస్మరన్ జాతిం బ్రహ్మైవా భ్యసతే పునః
బ్రహ్మాభ్యాసెన చాజస్ర మనంతం సుఖమశ్నుతే. (4-149)

పూర్వజన్మను స్మరించుటవలన సంసారమందు రోతపుట్టి మోక్షమును కోరి తిరిగి వేదాధ్యయనమునే చేయును. నిరంతరము వేదాభ్యాసము చేయుటవలన మోక్షానందమును పొందును.

ఇట్లు వేదాభ్యాస మొక గొప్పయాధ్యాత్మిక సాధనముగా పేర్కొన బడినది.

యథైధస్తేజసా వహ్నిః ప్రాప్తం నిర్దహతి క్షణాత్
తథా జ్ఞానాగ్నినా పాపం సర్వం దహతి వేదవిత్. (11-246)

అగ్ని యే రీతిగా కట్టెపుల్లలను తగులపెట్టునోయట్లే వేదవిదుడు పాపమును జ్ఞానాగ్నిచేత తగులబెట్టును.

ప్రాయశ్చిత్తములు

పాపము చేసినవాడు తనపాపము నితరులకు చెప్పుకొనుటచేతను, పశ్చాత్తాపపడుటచేతను, ఉగ్రతపస్సుచేతను లేదా గాయత్ర్యాది మహా మంత్రజపముచేతను, దానముచేతను పరిశుద్ధినొందును.

యథా యథా నరో ధర్మం స్వయంకృత్వానుభాషతే
తథా తథా త్వచేవాహిస్తే నాధర్మేణ ముచ్యతే. (11-228)

నరుడు తానుచేసిన అధర్మము నెంతగా చెప్పుకొనునో అంతగా వాడు, పాము కుబుసముచేత విడువబడునట్లు ఆ యధర్మముచేత విడువ బడును.

కృత్వా పాపం హి సంతప్య తస్మా త్పాపా త్ప్రముచ్యతే
నైవం కుర్యాం పునరితి నివృత్యాపూయతే తు సః. (11-230)

పాపముచేత పశ్చాత్తాపపడువాడు ఆ పాపమునుండి విముక్తుడగును. "ఇక నెన్నడును ఇట్లు చేయను" అని నిశ్చయించుకొని యాతడు పాపమునుండి మరలి పవిత్రుడగును.

ఏవం సంచిన్త్య మనసా ప్రేత్యకర్మఫలోదయమ్
మనో వాఙ్మూర్తిభిర్నిత్యం శుభం కర్మసమాచరేత్. (11-231)

ఈ రీతిగా మానవుడు తాను చేయుఫలమునుగూర్చి విచారించి మనోవాక్కాయములచేత నెల్లప్పుడును శుభకర్మనే ఆచరింపవలయును.

అజ్ఞానాద్యది వా జ్ఞానాత్కృత్వా కర్మ విగర్హితమ్
తస్మా ద్విముక్తి మన్విచ్ఛన్ ద్వితీయం న సమాచరేత్.
(11-232)

తెలిసికాని, తెలియకకాని చెడ్డపనిని చేసినవాడు దానినుండి విముక్తిని పొందగోరునో తిరిగి అట్టి పనిని చేయకూడదు. ప్రాయశ్చిత్తము చేసికొనవచ్చును కదాయని పాపము నాచరించుట గర్హితము.

పాపపనోదనమునకును అంతఃకరణశుద్ధికిని మనుస్మృతిలో బహువిధము లైన ప్రాయశ్చిత్తములు చెప్పబడినవి. అందు కృచ్ఛ్రసాంతపన మొకటి.

గోమూత్రం గోమయం క్షీరం దధి సర్పిః కుశోదకమ్
ఏకరాత్రోపవాసశ్చ కృచ్ఛ్రం సాంతపనం స్మృతమ్. (11-212)

గోమూత్రము, గోమయము, గోక్షీరము, గోదధి, గోఘృతము, కుశోదకము కలిపి లోపలకు తీసి కొనవలయును, ఆనాడు మరేమియు తినరాదు. మరునాడు పూర్తిగా నుపవాసము చేయవలయును.

ప్రాణావధిక ప్రాయశ్చిత్తములు కొన్ని కలవు. వ్యాహృతులతోను ఓంకారముతోను కూడుకొన్న పదునారు ప్రాణాయామములను నెలదినములు నిత్యముచేయుచో మహాదోషములుకూడ పోవును.

సవ్యాహృతి ప్రణవకాః ప్రాణాయామాస్తు షోడశ
అపి భ్రూణహణం మాసాత్పునన్త్యహరహః కృతాః.(11-248)

తాను చేసిన పాపములను పైకి చెప్పుటచేతను, పశ్చాత్తాపపడుటచేతను, తపస్సుచేతను, వేదపఠనముచేతను, దానముచేతను పాపమోచనము కల్గును.

ఖ్యాపనేనాను తాపేన తపసాఽధ్యయనేనచ
పాపకృన్ముచ్యతే పాపాత్ తథా దానేన చాపది. (11-227)

అహింస

ఆధ్యాత్మిక సాధనములలో ముఖ్యమైనది అహింస. సన్యాసి సర్వమును పరిత్యజించినను అహింసావ్రతమునుమాత్రము పరిత్యజింపరాదని చెప్పబడినది.

ఇంద్రియాణాం నిరోధేన రాగ ద్వేష క్షయేణ చ
అహింసయా చ భూతానా మమృతత్వాయ కల్పతే. (6-60)

ఇంద్రియనిగ్రహముచేతను, రాగద్వేష పరిత్యాగముచేతను, సర్వ భూతములపట్లను అహింస నవలంబించుటచేతనుఅమృతత్త్వము సాధ్యమగును.

యో బంధన వధక్లేశాన్ ప్రాణినాం న చికీర్షతి
స సర్వస్య హితప్రేప్సుః సుఖ మత్యంత మశ్నుతే. (5-46)

ఎవడు ప్రాణులను వధించుటకుగాని, బంధించుటకుగాని, బాధపెట్టుటకు కాని యిష్టపడడో, యెవడెల్ల ప్రాణులకును హితము కోరునో వాడు అనంతమైన (మోక్ష) సుఖమును పొందును.

ఆహారముకొఱకుగూడ ప్రాణులను హింసింపకూడదు.

అనుమన్తా విశసితా నిహన్తా క్రయవిక్రయీ
సంస్కర్తా చోపహర్తా చ ఖాదకశ్చేతి ఘాతకాః. (5-51)

మాంసమును తినువాడు, పెట్టినవారు, వండినవారు, అమ్మినవాడు, ప్రాణిని చంపినవాడు, అవయవములను విడదీసినవాడు, అనుమతించినవాడు అందరును చంపినట్లే.

యోఽహింసకాని భూతాని హినస్త్యాత్మ సుఖేచ్ఛయా
స జీవంశ్చ మృత శ్చైవ న క్వచి త్సుఖమేధతే. (5-45)

హింసను గల్గింపని ప్రాణులను (జంతువులనుకాని మనుష్యులను కాని) తమ సుఖముకొఱకు హింసించువారు జీవన్మృతులని చెప్పదగిన

వారు. అట్టి వారికి ఇహపరములలో సుఖముండదు. ఆత్మరక్షణ పరరక్షణముల కొఱకు శస్త్రము తీయుట దోషముకాదని మనువు చెప్పియున్నాడు. (8-349, 350)

అహింసయేంద్రియాసంగై ర్వైదికైశ్చైవ కర్మభిః
తపసశ్చరణై శ్చోగ్రైః సాధయన్తీ హ తత్పదమ్. (6-75)

అహింసచేతను, విషయసంగ పరిత్యాగముచేతను, వైదికకర్మలచేతను, ఉగ్రతపస్సులచేతను, బ్రహ్మపదమును చెందుదురు.

సర్వధర్మములలోను సత్యాహింసలకు మనువు అగ్రస్థానమునిచ్చు చున్నాడని ఇదివఱకు చూచియుంటిమి. "హింసలేకుండా బ్రతుకగలమా? నడచునపుడు క్రిమికీటకాదులు చనిపోవుట లేదా? శాకములలో ప్రాణము లేదా?" ఇత్యాది తర్కములకు మనుస్మృతిలో సమాధానము కలదు. ఈ ప్రశ్నలకు వెనుకనున్న భావము "ఈ హింసను చేయుచున్నపుడా హింస నెందులకు చేయరాదు?" అనునది. మనువు చెప్పున దేమన:- పరపీడనము నెంతతక్కువగా చేసిన నంతమంచిది. బొత్తిగా చేయకుండుట సర్వోత్తమము.

అద్రోహేణైవ భూతానా మల్పద్రోహేణవా పునః. (4-2)

(వృత్తి సంపాదనపరముగా చెప్పబడిన యీ యంశము ఇతర విషయములకుకూడ వర్తించును.)

కావున ధార్మికు డెప్పుడును "ఇంతకంటె తక్కువహింస సాధ్యము కాదా?" యను నాలోచనములో నుండవలయునేకాని "కొంత హింస అనివార్యముగా జరుగుచున్నందున మరికొంత హింసను ఎందుకు చేయకూడదు?" అను నాలోచన చేయరాదు.

గాయత్రీజపము

గాయత్రి మూడువేదముల సారము. ఓంకారముతోడను, భూః, భువః సువః అను వ్యాహృతులతోడను గూడిన గాయత్రిని సంధ్యాసమయములో జపించు విప్రుడు మూడువేదములను అధ్యయనముచేసిన పుణ్యమును పొందును.

ఇట్లు జపము చేయనివాడు వేదాధ్యయనము చేసియున్నను అధ్యయనఫలమును పొందడు. అధ్యయనము చేయనివాడుకూడ నిట్టి జపమువలన మహాపుణ్యము పొందును.

ఏతదక్షర మేతాం చ జపన్ వ్యాహృతి పూర్వికామ్
సంధ్యయో ర్వేదవిద్విప్రో వేదపుణ్యేన యుజ్యతే. (2-78)

సంధ్యాసమయములలోనే కాక ఇతరసమయములలోకూడ గాయత్రిని నదీతీరమునను, అరణ్యములలోను వేయిపర్యాయములు జపించువాడు కుబుసముచేత పాము విడువబడునట్లు పాపముచేత విడువబడును.

సహస్రకృత్వస్త్వ భ్యస్య బహి రేతత్త్రికం ద్విజః
మహతోఽప్యేనసోమాసాత్ త్వచేవాహి ర్విముచ్యతే. (2-79)

యోఽధీయతేఽహన్యహన్యేతాం త్రీణివర్షాణ్య తంద్రితః
స బ్రహ్మ పరమభ్యేతి వాయుభూతః ఖమూర్తి మాన్.(2-82)

ఎవడు గాయత్రీమంత్రమును అశ్రద్ధలేనివాడై మూడు సంవత్సరములు ప్రతిదినము జపించుచునే యుండునో వాడు వాయువువలె సర్వత్ర సంచరించు శక్తిగలవాడై బ్రహ్మయే యగును.

ఏకాక్షరం పరం బ్రహ్మ ప్రాణాయామాః పరం తపః
సావిత్ర్యాస్తు పరం నాస్తి మౌనాత్సత్యం విశిష్యతే. (2-83)

ఓంకారము పరబ్రహ్మప్రాప్తి సాధనము, ప్రణవవ్యాహృతి శిరస్సులను గలిగిన త్రిరావృత్తి గాయత్రితోకూడిన ప్రాణాయామములే మహాతపస్సు. గాయత్రికంటె గొప్పమంత్రము లేదు.

జప విశేషములు

విధియజ్ఞా జ్జపయజ్ఞో విశిష్టో దశభిర్గుణైః
ఉపాంశుః స్యాచ్ఛతగుణః సాహస్రో మానసః స్మృతః.(2-85)

దర్శపూర్ణమాసాది యజ్ఞములకంటె జపము పదిరెట్లు గొప్పది. ఆ జపములోను పైకి నుచ్చరింపబడు జపముకంటె ప్రక్కనున్న వానికి కూడ వినబడనట్లు చేయబడు ఉపాంశుజపము నూరురెట్లు గొప్పది. ఉపాంశువు కంటెను పెదవులు జిహ్వ కదలకుండునట్లు చేయబడు మానసజపము వేయి రెట్లు గొప్పది. (అయినను మానసజపము చేయుశక్తి గలుగువఱకు వాచికమును విడువరాదు.) ఈ జపవిశేషములుకూడ యజ్ఞములే.

జప్యే నైవతు సంసిధ్యే ద్బ్రాహ్మణో నాత్ర సంశయః
కుర్యాదన్యన్న వా కుర్యాన్మైత్రో బ్రాహ్మణ ఉచ్యతే. (2-87)

బ్రాహ్మణుడు యాగములు మున్నగువానిని చేయకపోయినను జపము చేతనే మోక్షార్హతను పొందును. యాగములో పశుహింసయున్నది కాని జపములో నదికూడ లేదు. కావున యాగముకంటె జపము విశేషము గలది. యాగము కూడ వేదవిహితమగుటచే దానిని నిషేధించుట సంభవింపదు. "నహి నిందాన్యాయము"గా నిచట జపముయొక్క ప్రాశస్త్యము చెప్పబడినది. ఇచట యాగనింద ఉద్దేశింపబడలేదు.

కామము

ఆత్మకల్యాణమునకు ప్రబల ప్రతిబంధకమైన కామము సర్వథాత్యాజ్యము; కాని యన్నృత జడదుఃఖాత్మకమైన సంసారమునుండి సచ్చిదానందస్వరూపమైన పరమాత్మను పొందవలయునను కోరికయు తత్సిద్ధికై వేదోక్తసాధనముల నవలంబింపవలయునను వాంఛయు మాత్రము త్యాజ్యములు కావు.

కామాత్మతా న ప్రశస్తా న చైవేహాస్త్య కామతా
కామ్యోహి వేదాధిగమః కర్మయోగశ్చ వైదికః. (2-2)

కోరికలను గల్గియుండుట మంచిదికాదు. కాని బొత్తిగా కామములను వీడుట యనునది యుండదు. వేదమును నేర్చుట, వేదానుసారము ప్రవర్తించుటకూడ కోరికకు సంబంధించినవే; కాని యట్టి కోరికలు నిషిద్ధములు కావు. వేదోక్తకర్మ నిష్కామముగా నాచరింపబడుచో నది చిత్తశుద్ధిద్వారా

మోక్షహేతు వగును. కావున నట్టి కర్మయోగముకూడ కామవిషయికమే యనుకొని వదలరాదు.

దానము

యత్కించదపి దాతవ్యం యాచితే నానసూయయా
వృత్పత్స్యతే హి తత్పాత్రం యత్తారయతి సర్వతః. (4-228)

వచ్చి యడిగినవానికి అంతో యింతో యిచ్చి తీరవలయును. దానమునందు అభ్యాసము గలవానికి ఎప్పటికైనను సంసారమునుండి తరింపజేయగల పుణ్యాత్ముడు ప్రతిగ్రహీతగా లభింపగలడు.

సర్వేషా మేవ దానానాం బ్రహ్మదానం విశిష్యతే
వార్యన్నగో మహీవాస స్తిలకాంచన సర్పిషామ్. (4-233)

గో భూదానాదు లన్నింటికంటెను వేదదానము (వేదాధ్యాపనము) గొప్పది. ఇతరుల మెప్పు కొరకు చెప్పుకొనుట వలన దానఫలము తగ్గిపోవును

యజ్ఞోఽనృతేన క్షరతి తపః క్షరతి విస్మయాత్
ఆయుర్విప్రాపవాదేన దానం చ పరికీర్తనాత్. (4-237)

అసత్య మాడుటచే యజ్ఞముచేసిన ఫలము తగ్గిపోవును "ఎంత తపస్సు చేసినాను?" అని తన తపస్సుపట్ల తానే ఆశ్చర్యపడుచో తపఃఫలము తగ్గును. విప్రులను నిందించుటవలన ఆయువు తగ్గును; చేసినదానము గొప్పకొఱకు చెప్పుకొనుటవలన దానఫలము తగ్గును. దానమును శ్రద్ధతోను, గౌరవముతోను చేయవలయును.

యోఽర్చితం ప్రతిగృహ్ణాతి దదాత్యర్చిత మేవచ
తావుభౌగచ్ఛతః స్వర్గం నరకం తు విపర్యయే. (4-235)

ప్రతిగ్రహీతను పూజించుచునే దానము చేయవలయును. అట్లు చేయబడిన దానమునే గ్రహింపవలయును. ప్రతిగ్రహీతపట్ల గౌరవరహితముగా

దానము చేసినవాడును, ఆ దానమును పట్టినవాడునుగూడ నరకమున కేగెదరు.

సత్క్రమముగా చేయబడిన దానమునకు దాతయొక్క సంకల్పము ననుసరించి ఫలముండును.

యేన యేన తు భావేన యద్యద్దానం ప్రయచ్ఛతి
తత్తత్తేనై వ భావేన ప్రాప్నోతి ప్రతిపూజితః. (4-234)

స్వర్గము కావలయునను కోరికతో దానము చేసినవానికి స్వర్గఫలమే వచ్చును. అన్నసమృద్ధిని కోరి దానము చేసినవానికదియే లభించును. మోక్షమునే కోరి దానము చేయువానికి మోక్షార్హతయే కలుగును.

తపస్సు

ఆధ్మాత్మికబలము నొసగగలవానిలో తపస్సు శ్రేష్ఠమైనది. అసాధ్యము లన్నియు తపస్సువలన సాధ్యము లగును.

యద్దుస్తరం యద్దురాపం యద్దుర్గం యచ్చ దుష్కరమ్
సర్వం తు తపసాసాధ్యం తపో హి దురతిక్రమమ్.(11-238)

ఏది దాట శక్యముకానిదో, యేది పొంద శక్యముకానిదో, యేది ప్రకాశింప శక్యముకానిదో, యేది చేయ శక్యముకానిదో అదియంతయు తపస్సుచేత సాధింపబడును. తపస్సు నేదియు మించజాలదు.

కావున చిత్తశాంతిని, వైరాగ్యమును, మోక్షమునుకోరు మునులు తపస్సు చేయుట కాంచనగును. కామ్యములుకూడ తపస్సుచే సాధింప బడగలవు. సాధారణములయిన తపస్సులలో చాంద్రాయణవ్రతమొకటి. తాను తిను ఆహారము పదునాలుగు కబళములగుచో, మాసములో కృష్ణ ప్రతిపత్తు మొదలు 14 దినములు దినమున కొకముద్దచొప్పున తగ్గించుచు అమావాస్యనాడు గంజి త్రాగి రెండవపక్షమున క్రమముగా దినమున కొక ముద్దచొప్పున ఆహారమును హెచ్చుచేయుచు పౌర్ణమినాడు తిరిగి గంజి మాత్రమే తీసికొనవలయును.

ఇట్టి తపస్సులు అంతఃకరణమును నిర్మల మొనరించి ఆత్మవికాసమును గల్గించి ఉపనిషదర్థమును ప్రత్యక్షజ్ఞానగోచరము గావించును.

భక్తి మార్గము

సంధ్యావందన జపహోమాదులు కర్మలేయైనను భక్తికి సంబంధించినవి కావు. అవియు నీశ్వరారాధన పద్ధతులే . అదికాక కేవలము భక్తి పద్ధతికూడ మనువునకు సమ్మతమె. సృష్టి స్థితిలయములకు పరమేశ్వరుడే కారణమనియు, పరమేశ్వర సంకల్పానుసారమే సర్వము నడచుచున్నదనియు మనువు ప్రథమాధ్యాయములో విపులముగా చెప్పియున్నాడు. భక్తిమార్గములో ప్రముఖ స్థానము పొందిన దేవతావిగ్రహారాధనముకూడ మనువునకు సమ్మతము. పర్వదినములలో దేవాలయముల కేగి దేవతాదర్శనము చేసికొనవలయునని చెప్పబడినది.

దైవతాన్యభిగచ్ఛేత్తు ధార్మికాంశ్చ ద్విజోత్తమాన్
ఈశ్వరం చైవ రక్షార్థం గురూనేవ చ పర్వసు. (4-153)

పర్వదినములలో దైవతములను, ధార్మిక బ్రాహ్మణులను, గురువులను, రాజును దర్శించి తనకు క్షేమమును సంపాదించుకొనవలయును.

దేవతావిగ్రహములకు కానుకలర్పించు పద్ధతికూడ మనుస్మృతిలో కన్పట్టుచున్నది. దేవాలయాదులలో దేవతల కర్పింపబడిన ధనమును హరించువాడు పాపాత్ముడని చెప్పబడినది.

దేవస్వం బ్రాహ్మణస్వం వా లోభే నోపహినస్తియః
స పాపాత్మా పరంలోకే గృధ్రోచ్ఛిష్టేన జీవతి. (11-26)

దేవాలయములలో దేవునకు సువర్ణాది దానముకూడ కొన్నిసందర్భములలో విధింపబడినది (7-20), దేవతానింద నిషేధింపబడినది.

నాస్తిక్యం వేదనిందాం చ దేవతానాం చ కుత్సనమ్
ద్వేషం దంభం చ మానం చ క్రోధం తైక్ష్ణ్యం చ వర్జయేత్.(4-163)

పరలోకము లేదను భావమును పొందరాదు. వేదమును నిందింపరాదు; దేవతలను దూషింపరాదు; ద్వేషమును, దంభమును, దురభిమానమును, కోపమును, ఇతరులపై మండిపడుటను విడిచిపెట్టవలయును.

ఇట్లు మనుస్మృతి ప్రధానముగా కర్మమార్గ ప్రతిపాదకమేయైనను అందందు వికీర్ణములైయున్న భక్తివిధాయకవచనములు భక్తిమార్గముయొక్క శ్రేయస్సాధనత్వమును నిరూపించుచున్నవి.

యమములు - నియమములు

త్రికరణశుద్ధమయిన బ్రహ్మచర్యము, దయ శీతోష్ణాదులను నిందావమానాదులను ఓర్చుకొను శక్తి (క్షాంతి), పరమేశ్వర ధ్యానము, సత్యము, ఆర్జవము (కౌటిల్యము లేకుండుట), అహింస, ఇతరుల సొత్తు నపహరింపకుండుట, మధురముగా మాట్లాడుట, ప్రవర్తించుట, ఇంద్రియ నిగ్రహము - ఇవి యమములనబడును.

స్నానము, మౌనము, ఉపవాసము, యాగముచేయుట, వేదాభ్యాసము, బ్రహ్మచర్యము, గురుశుశ్రూష, శౌచము, కోపములేకుండుట, కర్తవ్యములపట్ల ఏమరపాటులేకుండుట - ఇవి నియమము లనబడును.

[ఈ నియమములు యాజ్ఞవల్క్య స్మృతిలో (3-312,3-133)పేర్కొనబడినవి.

బ్రహ్మచర్యం దయాక్షాంతి ర్ధ్యానం సత్య మకల్కతా
అహింసాఽస్తేయ మాధుర్యే దమ శ్చేతి యమాః స్మృతాః

స్నానం మౌనోపవాసేజ్యా స్వాధ్యాయోపస్థ నిగ్రహాః
నియమా గురుశుశ్రూషా శౌచా క్రోధా ప్రమాదతాః.]

యమములు నియమములు కూడ నాచరింపదగినవే యనియు, నియమములకంటె యమములు ముఖ్యములనియు, నియమములను పాటించినను యమములను పాటింపనిచో మానవుడు పతితుడగుననియు మనువు చెప్పుచున్నాడు.

యమాన్ సేవేత సతతం ననిత్యం నియమాన్ బుధః
యమాన్ పతత్య కుర్వాణో నియమాన్ కేవలాన్ భజన్.
(4-204)

మనుస్మృతి వ్యాఖ్యాతయైన భల్లూకభట్టి ఈసందర్భమున నొక యుదాహరణము నిచ్చియున్నాడు. "స్నానము, అహింస - అను నీ రెండింటిలో దేనినో యొకదానిని పదలుకొనవలసినసందర్భము వచ్చునో స్నానము నే వదలుకొనవలయునుకాని అహింసను వదలుకొనరాదు" అని యాతడు చెప్పియున్నాడు. స్నానము నియమములోనిది; అహింస యమములోనిది.

యోగాభ్యాసము

మనువు నిర్దేశించిన ఆధ్యాత్మికసాధనలలో యోగాభ్యాస మొకటి.

దహ్యన్తే ధ్మాయమానానాం ధాతూనాం హి యథామలాః
తథేంద్రియాణాం దహ్యన్తే దోషాః ప్రాణస్య నిగ్రహాత్. (6-71)

అగ్నిచే కాల్చబడుటవలన బంగారము మున్నగు ధాతువుల మాలిన్యము పోవునట్లు ప్రాణాయామమువలన మనస్సు యొక్కయు చక్షురాదీంద్రియముల యొక్కయు దోషములు పోవును.

ప్రాణాయామై ర్దహే ద్దోషాన్ ధారణాభిశ్చ కిల్బిషమ్
ప్రత్యాహారేణ సంసర్గాన్ ధ్యానేనా నీశ్వరాన్ గుణాన్. (6-72)

ప్రాణాయామముచేత రాగద్వేషాది దోషములను పోగొట్టుకొనవలయును. మనస్సును పవిత్రలక్ష్యమందు నిలబెట్టుటచేత పాపమును పోగొట్టుకొన వలయును. ప్రత్యాహారముచేత ఇంద్రియములను శబ్దాది విషయములనుండి వెనకకులాగి విషయసంపర్కములను నివారించుకొనవలయును. కామక్రోధాది పరమేశ్వర వ్యతిరిక్తగుణములను పోగొట్టుకొనవలయును.

ఉచ్చావచేషు భూతేషు దుర్జ్ఞేయా మకృతాత్మభిః
ధ్యానయోగేన సంపశ్యే ద్గతి మస్యాంతరాత్మనః. (6-73)

ఈ జీవునకు దేవాద్యుత్తమ జన్మలును, పశ్వాది నికృష్టజన్మలును ఎట్లు కల్గుచున్నవో తెలిసికొనుటకు హృదయసంస్కారము లేనివారు అసర్థులు; ధ్యానయోగముగలవారు సమర్థులు. ధ్యానముచే అట్టి జీవగతులను తెలిసికొన్నవాడు బ్రహ్మజ్ఞాననిష్ఠుడు కాదగును.

ఉపసంహారము

సమ్యగ్దర్శన సంపన్నః కర్మభిర్న నిబద్ధ్యతే
దర్శనేన విహీనస్తు సంసారం ప్రతిపద్యతే. (6-74)

బ్రహ్మసాక్షాత్కారము కల్గినవాడు కర్మలచేత బంధింపబడడు. (వాని సంచితకర్మ జ్ఞానముచే నశించును. ఆగామికర్మయు అణగిపోవునేకాని మొలకలెత్తదు. ప్రారబ్ధముకూడ దేహావసానముతో ముగిసిపోవును) వానికి తిరిగి జన్మలేదు. బ్రహ్మసాక్షాత్కారము కలుగనివాడు జనన మరణరూప సంసారములోనే యుండును.

బ్రహ్మసాక్షాత్కారము గల్గుటకు పూర్వము అవశ్యముగా నుండదగిన చిత్తశుద్ధిని, వైరాగ్యమును గల్గించు కొన్నిసాధనము లీ ప్రకరణములో పేర్కొనబడినవి. మనుస్మృతిలో బ్రహ్మలక్షణములును, ఉత్తమ బ్రహ్మవిద్యాధికారి లక్షణములును చరమసాధన స్వరూపమును కూడ ఉదాత్త శైలిలో వర్ణింపబడి యున్నవి. కాని యే తత్ప్రకరణోద్దేశము పూర్వసాధనములకు మాత్రము పరిమితమైయున్నది. ఈ సాధనల నవలంబించువాడు చివరివఱకును పోజాలకపోయినను, చేసినసాధనము వ్యర్థముకాదు. ఉత్తరజన్మలలో నది ముందుకు సాగవచ్చును. అంతియేకాక ఈ సాధనలన్నియు పాపమును క్షయింపచేసి పుణ్యావృద్ధిని గావించున వగుటచే మోక్షమువరకు పోజాలని సాధకుడుకూడ దుఃఖములోను దుష్టజన్మలలోను పాపలోకములలోను పడకుండ ఉత్తమజన్మలను శుభలోకములను పొంది సుఖమార్గములోనే యుండుట సంభవించును. కేవల మోక్షగ్రంథముకాక ధర్మగ్రంథమగు మనుస్మృతిలో నీ సాధనలకు ప్రసంగ మీరీతిగా నుపపన్నమగుచున్నది.

గ్రంథోపసంహారము

సంగ్రహముగాను స్పష్టముగాను వేదమతమును ప్రతిపాదించు గ్రంథములలో మనుస్మృతియు భగవద్గీతయు ఉత్తమోత్తమములు. కర్తవ్యాంశములను తెలుపుటలో మనుస్మృతియు, ఆత్మానందపథమును నిరూపించుటలో భగవద్గీతయు విశేషప్రశస్తి నొందినవి. మనుస్మృతిలో ఆత్మానంద నిరూపణము లేకపోలేదు; అట్లే భగవద్గీతలో కర్తవ్యాంశనిర్దేశమును లేకపోలేదు; ఈ రెండు గ్రంథములును పరస్పర తాత్పర్యపూరకములై కర్మబ్రహ్మ నిరూపకమును స్వర్గాపవర్గఫలకమునైన శ్రుత్యుపదేశమును ప్రతిబింబింపచేయు నిర్మలదర్పణములుగా నున్నవి.

మానవకల్యాణకారకములైన యే తద్గ్రంథద్వయ మహోపదేశములపట్ల హెచ్చుమందికి అభిరుచియు, వీనికి లోకములో విశేషవ్యాప్తియు గల్గుట నాకాక్షించుచు నే నిదివరకు "భగవద్గీతా ప్రవేశము"ను ఇపుడీ "ధర్మమంజరి"ని దిక్ప్రదర్శకసూత్రములను రచించి యున్నాను. 2684 శ్లోకములతో విరాజిల్లుచున్న మనుస్మృతినుండి యవశ్యముగా నుదాహరింపవలసిన శ్లోకములను గూడ నెన్నిటినో విడచి వైచుట కొకకారణము, ఇదివరకే ప్రకటింపబడిన నా యితర గ్రంథములలో ఆశ్లోకములు కాని, వాని తాత్పర్యము కాని యుల్లేఖింపబడి యుండుట. ఈ గ్రంథములో నుదాహరింపబడిన మనువచనములను వివరించుటలో పదానువాద భావానువాద తాత్పర్యనిర్దేశాది పద్ధతులలో నే యొక్కటియు సార్వత్రికముగా నుపకరింపదు; కావున నే పద్ధతి యెట కార్యకారియో యట నా పద్ధతి యవలంబింపబడినది.

క్వచిద్గిరా మాంధ్రపదానువాదః
క్వచిత్తు తాత్పర్యనివేదనం చ,
క్వచిత్తథా భావనిరూపణం చ
క్వచ్చి చ్చ సంక్షేపత ఏవ సర్వమ్.

క్వచి త్స్వతంత్ర ప్రతిపాదనం స్యా
ద్వృథా చ మూలానుగుణం తథైవ,
బహుప్రదేశేషు విశేషభావాః
కుల్లూకభట్ట ప్రతిపాదితాశ్చ.

స్మృత్యంతరాభ్యాసజ సంస్కృతేస్తు
వ్యాఖ్యానరూపేణ చ కించిదుక్తమ్,
ఇత్థం మనోర్మార్గదిశం శుభాఢ్యాం
నిర్దిష్టమేవాఽత్రకృతః ప్రయత్నః.

మనుకల్పతరో రేషా
ధర్మప్రసవమంజరీ,
స్వగంధేన సమాకృష్య
మూలం నయతు పాఠకమ్.



T.T.D. Religious Publications Series No.422

Price Rs. 12/-

మానవుడు జీవితంలో పురోభివృద్ధి పొందవలయు నంటే కొన్ని నీతినియమాలను తప్పనిసరిగా పాటించాలి. కొన్ని ధర్మాలను విధిగా ఆచరించాలి. అలాంటప్పుడే ఆ మనిషి మనీషిగా మారి మార్గదర్శకుడవుతాడు. అంతేకాదు, అలాంటి ఉత్తములు పాటించే నియమాలు ధర్మాలు సార్వకాలికాలై, సార్వజనీనాలై వరలుతూ, ఆదర్శాలై నెలకొంటాయి.

శ్రీ జటావల్లభుల పురుషోత్తముగారు 'మనుస్మృతి' నుండి అందరికి అవశ్య ఆచరణీయాలైన కొన్ని ముఖ్య ధర్మాలను, నీతి నియమాలను సేకరించి భావ వివరణ చేస్తూ ఇందులో పొందుపరిచారు.

వీటిని ప్రతివ్యక్తి పాటిస్తే వసుధలో శాంతి సౌభాగ్యాలు మూడు పూవు లారుకాయలుగా వర్ధిల్లుతాయి.

Published by Sri **A.P.V.N.SARMA**, I.A.S., Executive Officer,
Tirumala Tirupati Devasthanams and Printed at T.T.D. Press, Tirupati.